ప్రజాశక్తి

Vol. 5, no. 11

(Sept. 13, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 11

(Sept. 13, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 5 సంచిక 11 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 13-9-44

"భారతదేశ స్వాతంత్ర్యానికి కాంగ్రెసు - లీగ్ ఐక్యతే మార్గం"

యు. పి. లీగ్ అధ్యక్షుని స్పష్టీకరణ

"సెపర్చ్‌లైట్" పత్రికా విలేఖరి షఫీక్ అహమద్ కిద్వాయ్‌తో యు. పి. రాష్ట్ర ముస్లింలీగ్ [illegible] నవాబ్ ఇస్మాయిల్‌ఖాన్ యిలా చెప్పారు:

"హిందూమహాసభవారు ఐక్యతకు వ్యతిరేకంగా చేసే ప్రచారం చూచి రెచ్చిపోవద్దని నేను ముస్లింసోదరులకు విజ్ఞప్తి చేస్తున్నాను. హిందూమహాసభయొక్క సవాలుకు కాంగ్రెసువాదులంతా తగిన జవాబు చెప్పవలసిందని కోరుతున్నాను. భారతదేశ స్వాతంత్ర్య సంపాదనకై గాంధీజీ ముస్లింలీగ్‌తో ఐక్యతను సాధించడానికి చేసే ప్రయత్నాలకైనుక హిందువులంతా ఉన్నారని కాంగ్రెసు రుజువు చేయవలసియుంది. మనం అనుసరించే పంథానుండి ఒక్కఅడుగు కూడా వెనక్కువేయవద్దు.

"అట్టి ఐక్యతవల్ల దేశాన్ని నేడెదుర్కొంటూన్న అనేక సమస్యలను పరిష్కరించడానికి మనం కలిసి బాధ్యతవహించగల్గుతాం. మిత్రరాజ్యాలపక్షాన పోరాడే అభివృద్ధిశక్తుల సహాయంతో మనం స్వాతంత్ర్యాన్ని పొందగల్గుతాం.

"స్వయంనిర్ణయసూత్రాన్ని వివిధప్రాంతాలకు వర్తింపజేయడంలో అనేక క్లిష్టసమస్యలు రావచ్చు. కాని, ఉభయులూ (గాంధీ-జిన్నా) సుహృద్భావంతోను, ఐక్యతకై తహతహతోను, వాటిని చర్చించినట్లయితే, నాయకులిద్దరూ ఒడంబడిక కుదుర్చుకోవడంలో సఫలులై తీరుతారు. పాకిస్తాన్ సిద్ధాంతాన్ని వర్తింపజేయడంలో ఏకీభావం కుదిరిననాడు జాతీయ ప్రభుత్వ నిర్మాణం విషయములో ఎలాంటి పేచీలురావు."

"ముస్లిములకు విడిపోయేహక్కు నీయడంలో మనం వెనుకాడరాదు"

చిత్తూరుజిల్లా కాంగ్రెసుకమిటీ కార్యదర్శి పిలుపు

కమ్యూనిస్టుపార్టీ ఆంధ్ర కమిటీ తరఫున చిత్తూరుజిల్లాలో జిల్లా ఆర్గనైజరుగా పనిచేస్తూన్న కామ్రేడ్ వై. బలరామమూర్తి యిలా వ్రాస్తున్నారు:—

చిత్తూరు జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి ఐన శ్రీ నగరి వరదాచార్యులు బి. ఏ., బి. ఎల్. గారితో నేను ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్నిగురించి చర్చించగా ఈ క్రింది విధంగా వారు తెలియజేశారు.

ప్రశ్న :—స్వయంనిర్ణయ సూత్రం ముస్లిం జాతులకు వర్తింపచేయుటవల్ల హిందువులకేమైనా నష్టమా?

జవాబు :—బ్రిటిషు ప్రభుత్వంనుండి విడిపోయే హక్కును కోరే మనము, ముస్లిములకు అదే హక్కును ఇవ్వటానికి వెనుకాడరాదు. ఇతర జాతులకంటె, ముస్లింలలో దేశభక్తి తక్కువ అని భావించటం, ముస్లిములను అగౌరవపరచుటతప్ప వేరుగాదు. స్వయంనిర్ణయసూత్రం అంగీకరించుటద్వారా, హిందువులకు నష్టం లేకపోగా, హిందూముస్లిములమధ్య, నిజమైన ఐక్యత ఏర్పడటానికి అవకాశముంది.

ప్రశ్న :—గాంధీ - జిన్నా సమావేశం జయప్రదమైన మీదట జాతీయప్రభుత్వం సంపాదించేందుకు ఏ కార్యక్రమం అవలంబించాలి?

జవాబు :—ఈ ప్రశ్నకు సమాధానం అంతసులభంకాదు. కాని ఐక్యతద్వారా మనదేశంలో, ప్రజాస్వామ్య వెల్లువ ఒకటి వస్తుందని పూహించవచ్చు తప్పక. హిందూ - ముస్లిములు తమ ఐక్యబలంతో, జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించితీరుతారు.

★

విశాఖజిల్లా నాయకుని ఆమోదం

విశాఖపట్నంజిల్లాలో ప్రముఖ కాంగ్రెసు నాయకులు, కేంద్ర శాసనసభలో సభ్యులు, అయిన శ్రీ కె. ఎస్. గుప్తాగారు జిల్లావిద్యార్థి సంఘ ఆధ్వర్యాన గతమాసంనుండి జరుగుతూన్న కాంగ్రెసు - లీగ్ ఐక్యతా ప్రచారాన్ని ప్రశంసిస్తూ యీక్రింది సందేశాన్ని యిచ్చారు:

"దేశభవిష్యత్తు యువకులచేతుల్లో ఉంది. యువకులే దేశాన్ని ముందుకు తీసుకు పోగల్గుతారు; లేదా వారే దేశానికితీరని అపకారం చేయగల్గుతారు. నేటి విషమపరిస్థితుల్లో మీరు మీ కర్తవ్యాన్ని అత్యుత్తమమైన రీతిని నెరవేర్చాలని దేశమాతఎదురుచూస్తోంది. భారతీయులతరఫున మహాత్ముడొక్కడే నేడు మనదేశ సమస్యను పరిష్కరించగలడు. అట్టి మహాత్ముని బలపరచడం మీపవిత్రకర్తవ్యం. ఆయన ఈమధ్య బ్రిటిష్ ప్రభుత్వానికి కొన్ని సూచనలు, ముస్లింలీగ్‌కు కొన్ని సూచనలు, చేసియున్నాడు. అవి భారతదేశంయొక్క స్వాతంత్ర్య సంపాదనకు ఎంతైనా తోడ్పడుతాయి. పైరెండుపక్షాలు తమ నిజాయితీని ఋజువు చేసుకోవలసిన అవకాశాన్ని యీ సూచనలు కలిగించాయి.

"స్వయంనిర్ణయసూత్రం అంగీకరింపబడి, కాంగ్రెసు - ముస్లింలీగ్‌ల మధ్య ఒడంబడిక కుదిరిననాడు లీగ్ ప్రతిష్ఠ తప్పకుండా ఎక్కువౌతుంది. రాజకీయ ప్రతిష్టంభనను పరిష్కరించడానికి గాంధీజీ ప్రభుత్వానికి యిచ్చిన పవిత్రమైన, అత్యుత్తమమైన, పిలుపు సఫలితానికి దారితీస్తే, బ్రిటిష్‌జాతియొక్క ప్రతిష్ఠ ముమ్మాటికీ ఎక్కువౌతుంది. ఎందువల్లనంటే బ్రిటిష్‌ప్రభుత్వం భారతజాతికి పదేపదే ఎన్నెన్నో వాగ్దానాలిస్తూ, వాటిని భంగపరచుతూండడంవల్ల దాని గౌరవం అడుగంటింది.


"ఇప్పుడు మీరు గాంధీజీని విస్పష్టంగా బలపరుస్తున్నారంటే, మన దేశంలో స్వాతంత్ర్యభానుడు ఉదయించే సమయం ఆసన్నమైందన్నమాట."

విజయనగరం 2-8-44 } (సం) కె. ఎస్. గుప్త

బొంబాయి విద్యార్థి మహాసభకు మహాత్ముని సందేశం

సెప్టెంబరు 3వ తేదీని జరిగిన బొంబాయి విద్యార్థుల మహాసభకు మహాత్ముడు యీ క్రిందివిధంగా సందేశం పంపించారు:

"కరువు మొదలైన బాధలకు గురియైన ప్రజలకు సహాయం చేయడంలో విద్యార్థులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి. అందుకు వారు తమకాలాన్ని, శక్తిని వినియోగించాలి. హరిజనులు, భిల్లులు, ఆదిమవాసులు – మొదలైన వెనుకబడ్డ జాతులకు విద్యార్థులు సహాయం చేస్తే, దేశానికి వారు చాలా సేవచేసిన వారౌతారు. స్వాతంత్ర్యపోరాటంలో అరెస్టు చేయబడ్డ కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ సభ్యుల్ని, [illegible] యితరుల్ని, విడుదల చేయాలని దేశంలో జరిగే ఆందోళనకు కూడా విద్యార్థులు తోడ్పడవచ్చు."



"దేశకళ్యాణంకోసం" అంటూ గాంధీజీ బయలుదేరారు జిన్నా ఇంటికి. "టాట్ వీల్లేద"ని అడ్డువడబోయాడు శ్యామప్రసాద్‌ముఖర్జీ, డాక్టరు మూంజీను. "హుం" అని పైకి ఉరకబోయాడు "వీర" సావర్కార్. వీళ్లు అడ్డుపడినంతమాత్రాన చరిత్ర ఆగిపోతుందా?
'డాన్' పత్రిక నుండి.

రిక్విజిషన్ చేయకుండానే రైతులు ధాన్యం సప్లయిచేయాలి

ధాన్యానికి న్యాయమైనధర నిర్ణయించాలని రైతుల రాయబారం

ధాన్యం ధరల సందర్భంలో కృష్ణాజిల్లా రైతుసంఘం తరపున గతమాసంలో మద్రాసు సివిల్‌సప్లయిస్ కమీషనరువద్దకు రాయబారం వెళ్లటం, తత్ఫలితంగా సివిల్ సప్లయిస్ కమిషనరు బెజవాడకు విచారణకై రావటం అందరకూ తెలిసిన విషయమే. ఆటు తర్వాత ధాన్య సేకరణకై పూర్తిగా మిల్లు యజమానులమీద ఆధారపడ్డ ప్రభుత్వం మిల్లు యజమానులను సంతృప్తి పర్చవలెననే ఉద్దేశంతో గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసరు నిర్ణయించిన రు. 10-9-7 ధరనే తాయపర్చటం జరిగింది. తమవద్ద అదనంగా ఉన్నధాన్యాన్ని కొరతప్రాంతాలకు పంపవలసిన అవసరాన్ని రైతులచే గుర్తింప చేయుటకూ, రైతులకు న్యాయమైన ధరనిచ్చి ధాన్యసేకరణ విధానంలో అతి ప్రధానమైన రైతులసహకారాన్ని సంపాదించుటకూ ప్రభుత్వం పూనుకోలేదు. అది. పూర్తిగా మిల్లుయజమానులపైననే ఆధారపడటంవల్ల మొత్తంధాన్య సేకరణ విధానమే తల్లక్రిందులయ్యే పరిస్థితు లేర్పడ్డాయి.

అందేత యీ విషయాలన్నిటినీ ప్రభుత్వానికి తెలియపర్చుటకై రైతులతరపున నండూరి ప్రసాదరావుగారూ, వద్దె శోభనాద్రిగారూ, వల్లపల్లి మల్లికార్జునరావుగారూ, మరికొంత మంది రైతులూ, నేనూ కలసి మద్రాసు ప్రభుత్వంవద్దకు రాయబారం వెళ్లాం. సివిల్ సప్లయిస్‌శాఖకు చెందిన ప్రధానోద్యోగస్థులను కలుసుకొని రైతులకు కల్గుతున్న అన్యాయాలనూ, వీనివల్ల ధాన్యసేకరణ విధానానికి కల్గే నష్టాన్ని విశదీకరించాం. నాల్గో తేదీన శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారుకూడ సివిల్ సప్లయిస్‌కమీషనరునుకలుసుకున్నారు. మళ్లీ 8వ తేదీన మద్రాసుప్రభుత్వపు ఆహారశాఖ సలహాదారులైన ప్రిన్‌ట్లీగారివద్దకురాయబారం వెళ్లి మెమొరాండం సమర్పించాం.

మెమొరాండం సారాంశం

"ప్రభుత్వం ధాన్యానికి నిర్ణయించినధరలు చాల అసంతృప్తికరంగా ఉన్నాయి. బియ్యం ధరలనుబట్టి న్యాయంగా ధాన్యానికి రావలసిన ధరను ప్రభుత్వంనిర్ణయించనందువల్ల రైతులు ధాన్యసేకరణ విధానానికి మనస్ఫూర్తిగా తోడ్పడుటకు ఆటంకం గల్గుతోంది. బందరు మిల్లుయజమానులు 100 బస్తాల ధాన్యానికి 48 బస్తాల (మూడుమళ్ళ బస్తాలు) బియ్యం దిగుబడిని గ్యారంటీ చేస్తామని ఆంధ్ర పత్రికలో అడ్వర్‌టైజు చేశారు. ఈమిల్లు యజమాను లంగీకరించిన దిగుబడినిబట్టి చూచినప్పటికి, 166 పౌనుల ధాన్యంబస్తాకు, సంచిలేకుండా, మిల్లువద్ద రు. 11-6-0 ఇవ్వవచ్చునని స్పష్టంగా రుజువౌతోంది. కాని, స్వార్థపరులైన కొందరు మిల్లుయజమానులు చూపెట్టుతున్న తప్పుడు దిగుబడిలెక్కల నాధారంగా చేసికొని, ప్రభుత్వం బస్తా 1కి రు. 10-9-7 లు ధర నిర్ణయించటం ఆక్షేపించతగ్గ విషయం.

"ఈ సందర్భంలో మేమేమీ అత్యధిక ధరల నాశించటంలేదన్న విషయాన్ని స్పష్టీకరించ దలచుకున్నాం. బియ్యంధరను పెంచకుండానే న్యాయంగా ధాన్యానికివ్వవలసిన ధరను నిర్ణయించవలెనని మాత్రమే రైతులం కోరుతున్నాం. కాబట్టి యీ ధాన్యంధరల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. మిల్లువద్ద సంచిలేకుండా 166 పౌనుల బస్తాకు రు. 11-6-0 ధర నిర్ణయించాలి. దీనితో బాటుగ క్రింద సరిగ్గా అయిన ఖర్చు అప్పు మాత్రం మినహాయించాలి.

"ఈ రకంగా ధాన్యంధరలను హెచ్చించే వరకూ కనీసం బియ్యంరూపంగా సప్లయి చేయటానికైనా రైతు కవకాశం కల్గించాలి. తిండిలేక మాడిపోతున్న మా సోదరప్రజల ప్రాణాలను కాపాడటంకోసం మావద్ద అదనంగా ఉన్న ధాన్యాన్ని విడుదలచేయవలసిన అవసరాన్ని మేము గుర్తించాం. ధాన్యానికి న్యాయమైన ధర నిర్ణయించవలెనని మాత్రమే మేము కోరుతున్నాం. లేదా కనీసం బియ్యంగా సప్లయిచేసేదానికైనా అవకాశం కల్గించండి. ఇలాంటి అవకాశం కల్గించినచో రిక్విజిషన్ చేయనవసరంలేకుండా, వారం రోజుల్లో 25 వేల బస్తాల ధాన్యాన్ని సప్లయిచేస్తామని కృష్ణాజిల్లా రైతుసంఘం తరపున హామీ యిస్తున్నాం. ఇలాంటి అవకాశం కల్గించినచో ఇకముందుకూడ ఇలాగే రిక్విజిషన్ చేయ నవసరంలేకుండా ఇంకెంతో ధాన్యం రావటానికి అవకాశం ఉంటుంది.

"అయితే రైతులకు బియ్యంగాసప్లయిచేసేదాని కవకాశం కల్గించినప్పటికి తమ మిల్లుల్లో బియ్యం మాడుటకు మిల్లు యజమాను లంగీకరించకపోవచ్చు. అందేత మిల్లు లెక్కువగా ఉన్న ప్రతికేంద్రంలోనూ రెండేసి బియ్యపు మిల్లులను ప్రభుత్వం కమాండీరు చేసి, రైతుల స్వాధీనంలో పెట్టవలసిందని కూడ మేము సూచిస్తున్నాం. ఈ సూచనలను గురించి, కమాండీరింగు విధానంలోని ఇతర లోపాలను గురించికూడ ప్రభుత్వం వెంటనే 'చర్యతీసికోవాలని' మెమొరాండంలో తెలియ చేయబడింది.

అధ్యైవరస ప్రిన్‌ట్లీగారు మెమొరాండంలోని విషయాలపై మాతో చర్చించిన తదుపరి తగు చర్య తీసికొంటామని జవాబిచ్చారు.

రైతుల కర్తవ్యం

మొత్తంమీద ప్రభుత్వంయొక్క ధోరణి చూస్తే మిల్లుయజమానులవైపుకే మొగ్గు ఉన్నట్లు కన్పిస్తోంది కాని వెంటనే ధరలు హెచ్చించే సూచన లెక్కడా కన్పడటం లేదు. దీనికంతకూ ప్రధానకారణం ధాన్య సేకరణ విషయంలో ప్రభుత్వం పూర్తిగా మిల్లుయజమానులపైననే ఆధారపడుతోంది. అందేత మిల్లు యజమానులను సంతృప్తి పరచవలెననే చూస్తోంది. కాని ఉత్పత్తిదారులైన రైతుల సహకార ఆవశ్యకతనుమాత్రం గుర్తించటంలేదు. దీనివల్ల చాల ప్రమాదం వాటిల్లుతుంది. తప్పకుండా మిల్లుయజమానులీ అవకాశాన్ని ఉపయోగించుకొని స్వేచ్ఛా వ్యాపారం కొనసాగించుటకూ, దొంగవ్యాపారాన్ని మరింత ఎక్కువచేయుటకూ, రేషనింగును భగ్నం చేయుటకూ, అసలు ధాన్య సేకరణ విధానాన్నే తల్లక్రిందులు చేయుటకూ తయారౌతారు. అందేత ధాన్యసేకరణ విషయంలో రైతుల సహకారంయొక్క ఆవశ్యకతని మనం ప్రభుత్వంచే గుర్తింపచేయాలి. పంటపండించు రైతులయొక్క న్యాయమగు కోర్కెలను నెరవేర్చినచో ధాన్యసేకరణ విధానం మరింత జయప్రదంగా కొనసాగుతుందన్న విషయం నిరూపించాలి. ఇంతేకాక కరవుప్రాంతాల ప్రజల ప్రాణాలను సంరక్షించేందుకై అదనపు ధాన్యాన్నంతనూ వెంటనే విడుదల చేయుటానికున్నూ సంసిద్ధులుకావాలి. ఈవిధంగా రైతులు ఎంత ఎక్కువగానూ, ఎంత త్వరగానూ తమవద్ద అదనంగావున్న ధాన్యాన్ని విడుదల చేస్తారో అంత త్వరగా రైతులకోర్కెలను ప్రభుత్వం అంగీకరించునట్లు చేయగలుగుతాం. కరవు ప్రాంతాలలోని మన సోదరప్రజలను కాపాడ గలుగుతాం.

ఇలాచేయక ధరలు పెంచేవరకు ధాన్యం విడుదలచేయం అని రైతులు భీష్మించుకొన్నట్లయితే ప్రభుత్వం మరింత నిరంకుశవిధానమవలంబించుటకు దారితీస్తుందేతప్ప మరేమీ ప్రయోజనం ఉండదు. పైగా ప్రభుత్వం పూర్తిగా మిల్లుయజమానులపైనే ఆధారపడుతుంది. రైతులకు కలుగుతున్న నష్టాన్ని పోగొట్టుటకు కించిత్తుకూడ ప్రయత్నించదు. ఇంతేకాక మనం ధాన్యం విడుదలచేయకుండా దాచినచో కొరతప్రాంతాల ప్రజలగతి ఏమవుతుందో కూడ ఆలోచించాలి. కాబట్టి ఎన్ని విధాలచూచినా ధాన్యాన్ని విడుదల చేయకుండా దాయటమనేది మనకూ, మనదేశానికీ కూడ తీరనినష్టమన్న విషయం స్పష్టంగా కన్పడుతోంది. అందేత అదనంగా ఉన్న ధాన్యాన్ని మనం వెంటనే విడుదలచేయాలి.

కొత్రగడ్డ రాజగోపాలరావు

అప్పుడే మన సోదర ప్రజలను సంరక్షించుటకై మనవంతుబాధ్యతను నెరవేర్చినవారలమౌతాం.

పోతే ధాన్యాన్ని రిక్విజిషన్ చేసేదాకా నిరీక్షించకుండా తమంత తాముగా రైతులు ధాన్యాన్ని విడుదల చేయుటకు ముందుకురావాలి. ఈ విడుదలచేసిన ధాన్యానికి న్యాయమైన ధర రాబట్టుకోటానికై కృషి చేయాలి. అందుకుగాను స్థానికాధికారులనూ మిల్లుయజమానులనూ కలుసుకొని రైతులు తమంతతాముగా ఇస్తున్న ధాన్యాన్ని బియ్యంగా ఆడించి యిచ్చుటకు తగిన అవకాశాలు కల్పించవలసిందిగా సంప్రదింపులుచేయాలి. ఈ విధంగా రైతులే రిక్విజిషన్ చేయని ధాన్యాన్ని బియ్యంగా సప్లయిచేయుటకు ముందుకు వచ్చినచో, న్యాయమైనధర రాబట్టుకోటానికి మనకెన్నో అవకాశాలున్నాయి. అన్నిటికంటె ముఖ్యంగా సరియైన దిగుబడిని చూపెట్టి, న్యాయంగా ధాన్యానికి ఎంత ధర యివ్వవచ్చునో రుజువుపర్చుటకు చక్కటి అవకాశం కల్గుతుంది. కాబట్టి యీ పనికి రైతుసోదరులూ, రైతు శ్రేయోభిలాషులూ తీవ్రంగా కృషిచేయవలసి ఉంటుంది.

ఈ సందర్భంలో సోదర రైతుసంఘాలవారికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాం. 12 రూపాయల ధర రాబట్టుకోవాలనే ఉద్దేశంతో బియ్యం ధరలను పెంచమనటం, ఎగుమతి చేయకూడదనటం శ్రేయస్కరంకాదు, సంభవమూ కాదు. పైగా బియ్యంధరలను పెంచినచో పాటి బీదప్రజలు, కరవుప్రాంతాలలోనివారు ఎన్ని కడగండ్లు పడవలసి వస్తుందో శాస్త్రీయంగా ఆలోచించండి! బియ్యం ధరను పెంచనక్కరలేకుండానే న్యాయంగా ధాన్యానికివ్వవలసిన ధరను రాబట్టుకోటానికై మనమందరం కలసి కృషిచేద్దాం. ప్రభుత్వం నిర్ణయించిన ప్రస్తుత బియ్యంధరల ప్రకారం మిల్లువద్ద ధాన్యం బస్తాకు రు 11-6-0 ధర యివ్వవచ్చునని స్పష్టంగా రుజువౌతోంది. ఈ ధరను రైతుకు రాకుండా చేయవలెనని అడ్డుపెడుతున్న మిల్లుయజమానుల కుతంత్రాలనుబయటపెట్టుటకై అందరం కలసి పనిచేద్దాం.

సోవియట్ మిత్రమండలి, ఏలూరు

ఏలూరు పట్టణ సోవియట్ మిత్రమండలిని ఏర్పరచుటకై దివ్యజ్ఞానసమాజహాలులో 7-9-44 తేదీన సమావేశం జరిగింది. శ్రీయుత్ వల్లూరి బలరామకృష్ణ, అడ్వకేటుగారు అధ్యక్షత వహించారు. వివిధ రాజకీయదృక్పధాలు గల పెద్దలు చాలామంది సభకు విచ్చేశారు.

సభను ప్రారంభిస్తూ అధ్యక్షులు సోవియట్ విధానంయొక్క ప్రాముఖ్యతను గురించి చెప్పారు. ఇతర దేశములన్నింటికంటె ఆదర్శకరమైన సమాజాన్ని సోవియట్ ప్రజలు నిర్మించారని, యుద్ధానంతరపునర్నిర్మాణమును గురించి ప్లానులు తయారుచేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో సోవియట్ సమాజ పరిశీలన అత్యవసరమని, అందుకై సోవియట్ మిత్రమండలి కృషిచేస్తుందని చెప్పారు

తరువాత శ్రీ ఎం. రామకృష్ణారెడ్డి, డాక్టరు మాలే కృష్ణారావుగార్లు సోవియట్ సమాజం యొక్క ముఖ్యలక్షణాలను కొన్నింటిని పేర్కొని మానవుని ప్రధాన సమస్యలను జయప్రదంగా పరిష్కరించిన సోవియట్ సమాజమును గురించి తెలుసుకొనవలసిన ఆవశ్యకత నేడు ఎక్కువయుందని ఉపన్యసించారు.

సోవియట్ మిత్రమండలి ఏ రాజకీయ పక్షమునకు చెందినదికాదని, ఉద్యమచరిత్రను వివరిస్తూ మండలి ఆశయాలను గురించి కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) గారు మాట్లాడారు.

తరువాత ఈ క్రింది కమిటీ ఏర్పడింది.

అధ్యక్షులు :

శ్రీ వల్లూరి బలరామకృష్ణ. అడ్వకేటు

కార్యదర్శులు :

శ్రీ యం. రామకృష్ణారెడ్డి.

శ్రీ మునిపల్లె రామారావు. అడ్వకేట్సు

కమిటీ సభ్యులు :

డాక్టర్ మాలే కృష్ణారావు, కె. కామేశ్వర రాజు, అడ్వకేటు, ఎ. సర్వేశ్వరరావు.

సమావేశం చివరిలో, పుప్పాటూరి శేషగిరి రావుగారు, సోవియట్‌మిత్రమండలి లైబ్రరీని నిర్మించుటకై రు. 50 లు విరాళం ఇచ్చారు.

రైసుమిల్లులు:
'ఎస్సెన్షియల్ సర్వీస్ ఆర్డినెన్సు'

'ఎస్సెన్షియల్ సర్వీస్ ఆర్డినెన్సు'ను ఆంధ్ర దేశంలో తూర్పు గోదావరి జిల్లా, కృష్ణ, గుంటూరు జిల్లాలలోని రైసుమిల్లులకు వర్తిస్తుందని ప్రభుత్వం 15-8-44 తేదీన ఒక ఉత్తరువు ప్రకటించింది. ఈనాలుగు జిల్లాలలోను సుమారు 850 రైసు మిల్లులున్నాయి. దాదాపు 10 వేలమందిదాకా వీటిలో పనిచేస్తూవుంటారు. ఈ ఆర్డినెన్సు యీ 10 వేలమందికి వర్తిస్తుంది.

ఇంకా వైజాగ్, నెల్లూరు, కడప జిల్లాల్లో కూడ సుమారు 65 మిల్లులున్నాయి దాదాపు 1100 మంది పనిచేస్తూవుంటారు. కాని ప్రస్తుతం యీ ఆర్డినెన్సు వీటికి వర్తించదు.

ఈ ఆర్డినెన్సులోని ముఖ్యమైన విషయాలేమిటి? యెవరికి వర్తిస్తుంది? పనివారలు, యజమానులు దానిప్రకారం యెలా నడుచుకోవాలి?

1. రైసుమిల్లులలో ధాన్యాన్ని మరపట్టి బియ్యం చేయుటకు మెకానిక్కు, ఫైర్‌మన్, కూలీలు, ధాన్యం కాటావేయుటానికి, మొయ్యటానికి, కొంతమంది కూలీలు పనిచేస్తూవుంటారు. ధాన్యం బియ్యంగా చెయ్యాలంటే వీరందరూ పనిచెయ్యాలి. వీరుగాక ఫ్యాక్టరీ మేనేజిమెంటుకూడ అవసరమే. 15-8-44 తేదీన జారీచేసిన ప్రభుత్వ ఉత్తరువుప్రకారం యీ ఆర్డినెన్సు ధాన్యాన్ని మరపట్టటానికి అవసరమైన వారందరికి వర్తిస్తుంది. ఫ్యాక్టరీ మానేజిమెంటుకుకూడ వర్తిస్తుంది.

2. ఈ ఆర్డినెన్సు ప్రకారం పనివారలు తమ పనులు మానుకొని పోవటానికి వీలులేదు. పనిచేయు పరిస్థితులు తృప్తికరంగా లేవనిగాని, యెక్కువ జీతాలు కావాలనిగాని, తాము పనిచేసేచోట శత్రుప్రమాదం వున్నదనిగాని, పనివదలి పోవటానికి వీలులేదు. కాని యజమాని యిష్టంమీద మీరు పనిలోనుండి మానుకోవచ్చు. యజమానులు కూడ సొంతలు చూపి పనివారను తొలగించటానికి వీలులేదు.

3. దీనిప్రకారం ప్రభుత్వం జీతాలు, పనిచేయు నియమాలు, (అంటే ఎన్నిగంటలు పనిచెయ్యాలి, శలవులు మొదలైనవి) నిర్ణయిస్తూ కొన్నిరూల్సు చేయవచ్చును. ఉభయపార్టీలు ఆ రూల్సు ప్రకారం నడుచుకోవాలి. లేకపోతే వారు చట్టవిరుద్ధంగా నడుస్తున్నారన్నమాట. అట్టివారిని యీ ఆక్టుప్రకారం శిక్షించవచ్చును.

4. ఈ ఆర్డినెన్సు ప్రకారం సమ్మెచేయటానికి వీలులేదు. సమ్మెచేయమని ప్రోత్సాహపరచినవారుకూడ నిందితులే అవుతారు. ఇలా చేసినవారిపై జరిమానా, 1 సంవత్సరం జైలుశిక్షలు విధించవచ్చును. దీనిప్రకారం హర్తాలు కూడ చేయటానికి వీలులేదు.

ఇవి యీ ఆర్డినెన్సులో వున్న ముఖ్యవిషయాలు. నేటి పరిస్థితులలో యీ ఆర్డినెన్సు వల్ల యెలాటిఫలితాలు కలుగుతాయో చూద్దాం.

ప్రజానీకం జీవితంలో రైసు మిల్లులు అత్యావసరమైనవనే విషయం ప్రభుత్వం గ్రహించి యీ ఆర్డినెన్సును వాటికికూడ వర్తింపజేసింది ఈ ఆర్డినెన్సు ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకొని సరిగా ఆచరణలో పెట్టబడితే, ప్రజాసామాన్యానికి కంతకూ మేలు జరుగుతుంది. దేశరక్షణకు జయప్రదంగా నెరవేరుతుంది కాని, యజమానుల కుయుక్తులను అరికట్టకపోతే వారు దీనిని తప్పువాడరు. కార్మికులను నిలువునాదోచుకొంటూ, కార్మికులలో అసంతృప్తి కలిగింపుతారు. దేశరక్షణకును, కంట్రోలును తగ్గించ చేయుటానికని, యజమానులు ధాన్యం సప్లయి లేదనే సాకుతో మిల్లులను మూసివేస్తున్నారు. అందువల్ల యీ ప్రమాదాలనుంచి కాపాడుకొని, ప్రజా జీవితానికి అవసరమైన బియ్యాన్ని అందించేటట్లు చూడాలి.

ఈ రైసు మిల్లులలో పనిచేయు వారి పని స్థితులు చాల దారుణంగా వున్నాయి. ధరల పెరుగుదలనుబట్టి జీతాలు పెరగలేదు సరిగదా, కాటావనివారి రోజు సంపాదన పడిపోతున్నది. మిల్లులు సక్రమంగా పనిచేయుట లేదు. యెక్కడ చూచినా సగానికి సగం మిల్లులు ఆడటంలేదు. మిల్లులు పనిచేయని రోజులలో మెకానిక్కులు తప్ప మిగిలినవారు చేతులునులుపుకుంటూ కూర్చోవలసిందే; వారికి కూలి నియ్యరు. ఈ ఆర్డినెన్సు ప్రకారం యీ పనివారిగతి యేమికావాలి? ఫ్యాక్టరీ వదలిపోవటానికి వీలులేదు. చేతులు ముడుచుకుంటూ కూర్చుని అప్పులపాలు కావలసిందేనా? కాబట్టి -

మన సూచనలు

1. ప్రభుత్వం జీతాలను, పనిచేయు షరతులను, నిబంధనలను, వెంటనే నిర్ణయించాలి. కార్మికుల ప్రతినిధులతోను, యజమానుల ప్రతినిధులతోను సంప్రదించి వీటిని నిర్ణయించాలి. ఈ నిర్ణయాలు న్యాయముగా జరగక, యజమానుల ఒత్తిడికి లొంగి ప్రభుత్వం ప్రవర్తిస్తే కార్మికులు చాల కష్టాల పాలౌతారు. మరేపనీ చేసుకొనేందుకు వీలులేక పోవటంవల్ల తిండికి అల్లాడుతారు. ప్రజలకు బియ్యం సప్లయి చెయ్యలేకపోతారు.

2. ప్రభుత్వం పనివారల కనీసపు జీతం, కరువుభత్యం, వేరువేరుగా నిర్ణయించాలి. రోజుకూలికి పోయి, మామూలు పనులు చేసుకునే కార్మికులు సహితం రోజుకు 10, 12 అణాలు సంపాదిస్తున్నారు. పనిపత్తిడి రోజులలో యింకా యెక్కువకూడ సంపాదించుతున్నారు. మిల్లుయందు పని చేసే సామాన్య కార్మికులకు (unskilled labour) కనీసం యీమాత్రమైనా గిట్టాలి. లేకపోతే వారు యీ వృత్తిని అంటిపెట్టుకొని వుండరు. యెక్కువకూలి దొరికేచోట్లకు కార్మికులు వసులకు పోవటం సహజం. ఈఆర్డినెన్సు వాదానివంగా పోకుండా ఆటంకపరుస్తుంది. వారిలో నిస్పృహ యేర్పడి పని చురుకుగా చేయలేకపోతారు. అందువల్ల మిల్లులలో పనిచేసే ప్రతివ్యక్తికి కనీసం 8-12-0 రోజు కూలి గిట్టేటట్లు చూడాలి.

మిల్లులందు పనిచేసే మెకానికల్ డిపార్టుమెంటువారి జీతాలుకూడ నిర్ణయించబడాలి. వీరి జీతాలు రైల్వే మొదలైన పరిశ్రమలందు యిలాంటి పనిచేసే కార్మికుల జీతాలకు సమానంగా వుండాలి.

3. మిల్లులు సరిగా పనిచేసేటట్లు చూడటానికి ప్రభుత్వం ఒక కంట్రోలరును నియమించాలి. యజమానులు అత్యధిక లాభాలను పొందాలను వుద్దేశంతో దేశరక్షణకును, కంట్రోలును తగ్గించేయటానికి పూనుకున్నారు. ధాన్యం కంట్రోలుధరలకు కొనకపోవటం, కొన్న ధాన్యాన్ని దాచివుంచి మిల్లులను పనిచేయించకుండటం, ప్రస్తుతం జరుగుతున్నది. దీనివల్ల కార్మికులవేతనాలు కుంటుపడటమేకాకుండా, ప్రజలకు బియ్యం సప్లయి లేకుండా పోతుంది. యజమానుల ఆటకట్టించాలంటే, ప్రభుత్వం ఒక కంట్రోలరును నియమించాలి.

4. అనివార్యమైన కారణాలవల్ల మిల్లు మూసివేసేటట్లయితే, మూసివున్నరోజులకు, కార్మికులకు, కనీసం సగంజీతం, కరువు భత్యం, యజమానులచేత తప్పనిసరిగా యిప్పించాలి.

ప్రభుత్వం పైసూచనలను నెరవేర్చుతూ యీ ఆర్డినెన్సును ఆచరణలోనికి తేవాలి. ఈ సూచనలను ప్రభుత్వం అమలు జరపాలని కార్మికసంఘాలు తీవ్రమైన ఆందోళన చెయ్యాలి

వివిధప్రాంతాల్లో రైతులయిక్కట్లు

అనంతపురంజిల్లా ధర్మవరం తాలూకాలో వరుసగా 3 సంవత్సరాలనుండి వర్షాలు లేక, పంటలు పండుటలేదు. ఈ సంవత్సరం ముంగారి వర్షాలు అంత యెక్కువగా కురియలేదు. పదునులు మాత్రం అయాయి. వాటికి జొన్న, కొర్ర, వేరుసెనగ మొదలైన పైరులు వేశారు. కాని రెండు నెలలుగా వర్షం కురియనందున అవి యెండిపోతున్నాయి.

ఇట్టి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వ ధాన్య సేకరణ విధానం రైతుల్ని కలవర పెడుతోంది. చాల మంది రైతులవద్ద నిలవధాన్యం లేదు. ప్రభుత్వ ప్లాను ప్రకారం 10 యకరాలకు మణుగు చొప్పున యివ్వాలంటే, రైతులు దెబ్బతింటారు. ఈ ప్రాంతంలో 1 యకరానికి 20 సేర్లు కూడా పండదు. ఇక్కడి భూములన్నీ ఎర్రనేలలు; సారవంతమైనవి కావు. 1 యకరానికి మణుగు ధాన్యం యివ్వాలంటే, ఖరీదుచేసి ఇవ్వాలి. అందుచేత రైతుల్లో తీవ్రమైన ఆందోళన బయల్దేరింది. ఇంతేగాక, యీ ప్రాంతం భూములలో గుట్టలు, కల్లువలు ఎక్కువగా వుంటాయి. కరణాలు వీటిని విరవినిఖ్రాయరు. అందువల్ల ఆ విస్తీర్ణానికి కూడ రైతులు ధాన్యం యిచ్చుకోవలసివస్తోంది. ధర్మవరం తాలూకా అంతటా ఇదే పరిస్థితి. దీన్ని తొలగించి, రైతుల యిబ్బందులు తీర్చడానికి ప్రభుత్వాధికారులు పూనుకోవలసిందిగా తాలూకా రైతుసంఘ అగ్రనాయకులు సి. ముత్యాలప్పగారు వ్రాస్తున్నారు.

నూగూరు ఏజన్సీలో

ఇది తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రాంతం ఇక్కడి పంటభూములన్నీ జమీందారుల వశంలో వుండుటవల్ల, ఎక్కువ ధరలకు వారు తమ ధాన్యాన్ని నిల్వ వ్యాపారస్తులకు అమ్మివేసుకున్నారు. మిగతా పంట ప్రజలకు ఏడెంటు మూడు నెలలకో సరిపోతుంది. మిగిలిన రోజుల్లో సామాన్యంగా రాజమండ్రి ఎగుమతులపై ఆధారపడేవారు. కాని, యిప్పుడు రాజమండ్రిలో రేషనింగు ప్రవేశ పెట్టబడుటవల్ల దానిసాకుతో అధికారవర్గం ఏజన్సీ ప్రాంతపు అవసరాలను తీర్చుటలేదు. దీనికితోడు మొన్న విపరీతంగా గోదావరి వరదలు రావడంవల్ల పంట చేలకు నష్టం కలిగింది. కొన్నిగ్రామాలలో ధాన్యాధులు గంగలో కలిసిపోయాయి.

వెంటనే ప్రభుత్వం జమీందార్లవద్ద, నిల్వ వ్యాపారస్తులవద్ద, ఉన్న ధాన్యాన్ని విడుదల చేయించి, ప్రజల అందుబాటుకు తేవలెనందని కోరుతూ తాలూకా రైతుసంఘ కార్యదర్శి సత్తిరాజు రామచంద్రరావుగారు ప్రకటన గావిస్తున్నారు.

కైకలూరు తాలూకాలో కోడి తెగులు

ఈ తాలూకాలో పండేపంట సరిగా తాలూకా అవసరాలకు సరిపోతుంది. కాని, కొల్లేటి ముంపువల్ల ప్రతిసంవత్సరం కొంత నష్టం సంభవిస్తూ ఉంటుంది. దీనికి తోడు గతసంవత్సరం కోడితెగులు 20 వేల యకరాల పంటను పొట్టబెట్టుకుంది. మళ్ళీ యీ సంవత్సరం శీతనపల్లి, వరహాపట్నం, రావపట్నం, గోపవరం, పెదకామనపూడి మొదలైన గ్రామాలలో ఈ తెగులు బయల్దేరింది. వెంటనే తాలూకా రైతుసంఘం, అగ్రికల్చరల్ డైరెక్టరుగారికి, జిల్లా అధికార్లకు, తెలియపరిచింది. తాత్కాలికంగా తెగులును కొంతవరకు అరికట్టుటకు తెగులు తగిలిన పొలాలమధ్య పైరుకంటె కొంచెం ఎత్తులో పెట్రొమాక్సులైట్లు పెట్టుట, గట్లమీద మంటలుపెట్టుట మంచిదని చెప్పారు. అందుకుగాను కిరోసిన్‌కూడా యిప్పిస్తామన్నారు. ఈపద్ధతిని రైతు లవలంబించారు. జిల్లాఅధికారులు విశాఖపట్నంలోని అసిస్టెంట్ మైకాలజిస్టుకు (పంటతెగుళ్ళనుగురించి పరిశోధనచేసే అధికారి) వ్రాశారు. (4-9-44 నాటివార్త) ఉత్తర ప్రత్యుత్తరాలతో కాలయాపన చేయక, వెంటనే తగుచర్య తీసుకోవలసిందని కోరుతూ కృష్ణాజిల్లా రైతుసంఘ ధృతీలు అనుమర్లపూడి వెంకటరామారావుగారు వ్రాస్తున్నారు.

●

ఒంగోలు ఇనపవర్తకుల ఓటమి

ఒంగోలులో యినుపవర్తకులు ధరల కంట్రోలును తిరస్కరించి, దొంగమార్కెట్టులో విపరీతమైన ధరలకు అమ్ముతూ వచ్చారు. రు. 3-8-6 ఖరీదుచేసేవస్తువును రు. 30 లకు అమ్మారు. రు. 23 చేసే బండి పట్టాలు రు. 80 లకు అమ్మారు.

తాలూకాయందలి వివిధ గ్రామాలనుండి 100 మంది రైతులు తాలూకా రైతుసంఘ యాజమాన్యాన అగస్టు 20 వ తేదీని కమర్షియల్‌టాక్సు ఆఫీసరువద్దకు రాయబారంవెళ్లి, ఈ అక్రమాన్ని గురించి వివరించారు. కొట్లు సోదాచేయగా, రహస్యపు సరుకు బయటపడింది. రైతుసంఘమే బాధ్యతతీసుకొని, పనిముట్లను కంట్రోలు రేట్లకు పంచిపెట్టించింది. సుమారు 120 గ్రామాల రైతులకు యినుప పనిముట్లు కంట్రోలు రేట్లకులభించాయి. రైతులు రైతుసంఘ కార్యాలయానికి వచ్చి, చీట్లుతీసుకొని, వంతులప్రకారం కొనుక్కొంటున్నారు. వాలంటీర్లు దగ్గరఉండి, పనిముట్లు యిప్పిస్తున్నారు ఒక వృద్ధరైతు ఆనందాన్ని పట్టలేక, "నా గేటి కర్రు కళ్ళజూచి మూడేండ్లయింది. బాబు! సంఘం పుణ్యమాఅంటూ నేటికి తిరిగికళ్ళజూచాను!" అన్నారు.

తాలూకా రైతుసంఘం యొక్క ఈకృషివల్ల 150 మంది రైతులు రైతుసంఘకార్యాలయానికివచ్చి, సంఘంలోసభ్యులుగాచేరారు.

గుంటూరు జిల్లాలో ఎరువులసమస్య

మిల్లుయజమానులు దొంగమార్కెట్టును ప్రోత్సహిస్తున్నారు

— రావి అమ్మయ్య

గుంటూరుజిల్లాలో తెనాలి, రేపల్లె, బాపట్ల తాలూకాలలో 3 లక్షల 60 వేల యకరాలకు పైగామాగాణి సేద్యం ఉంది. మిగతా తాలూకాలలో మరో లక్షకుపైగా మాగాణి సేద్యం ఉన్నది. మొత్తంమీద ఈ భూములన్నిటికి ఎరువులు వేస్తేనేగాని సరిగా పండవు. ఎక్కువ భాగం వేరుశనగపిండి వేస్తారు. కిందటి సంవత్సరం అధికోత్పత్తిని దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం ఎరువుల ధరను కంట్రోల్ చేసింది. ధరను కంట్రోల్ చేసినప్పటికీ, స్టాకు తగినంత లేనందున దొంగ మార్కెట్ ఏర్పడటం, రైతువర్కర్లు విపరీతంగా కృషిచేసి, దొంగ మార్కెట్‌ను అంతంచేస్తూ - ప్రధానంగా, సప్లయిలు అధికం చేయాలని - మద్రాసుప్రభుత్వంపై ఒత్తిడి తేవడం, విశాఖజిల్లానుండి చివరి సమయంలో కొన్నివేల బస్తాలు ఈజిల్లాకు దిగుమతి చేయడం జరిగింది.

లైసెన్సింగ్ పద్ధతి

ఇక 1944 లో పరిస్థితులు పరిశీలింపుదాము. ఎరువుల వ్యాపారం చేసేవారందరికి లైసెన్సు పద్ధతిని ప్రవేశపెట్టారు. ధరలు కంట్రోల్ చేసేటప్పుడు - మిల్లు ఓనరు ఇవ్వవలసిన రేటు గోతాంతోసహా 20-0-0 లనీ, చిల్లరవ్యాపారస్తుడు రు. 24-0-0 లకు అమ్మాలనీ, నిర్ణయించారు. జిల్లాలో ఎక్స్‌పెల్లర్ మిల్లు 63 ఉన్నవనీ, జిల్లాలో తయారయ్యే పిండిజిల్లాఅవసరాలకుసరిపోతుందనీ, అంచనావేశారు వ్యవసాయశాఖవారు. జిల్లాలో వేరుశనగ ఎక్స్‌పెల్లర్‌లు సత్తెనపల్లి, నరసారావుపేట, దాచేపల్లి, పిడుగురాళ్ళ, గుంటూరు ప్రాంతాల్లో ఉన్నవి. అంటే మెట్ట తాలూకాల్లో ఉన్నవి. ఉత్పత్తిచేసే యీ తాలూకాలనుండి వినియోగించే స్థానాలైన బాపట్ల - రేపల్లె - తెనాలి తాలూకాలకు చిల్లర వ్యాపారస్తులు మిల్లుల్లో రు 20/- లకు కొని, రవాణా ఖర్చులు - సేల్సు టాక్సు - లాభాలతో రు. 24 లకు అమ్మాలి సంవత్సరారంభంలో చిల్లర వ్యాపారులు మిల్లులలో రు. 19 లు రేటుతో కొన్ని పార్వర్డు బేరాలు చేశారు. అలాచేసిన స్టాకుల్ని తీసుకొని వచ్చారు. మిల్లుల్లో ఇంకా ఎంతో ఉత్పత్తి ఉన్నది. పిండిని ఉపయోగించే తరుణం ప్రారంభం కాగానే మిల్లులవాడు రు. 20 లకు చిల్లర వ్యాపారస్తులకు పిండి ఇవ్వ నిరాకరించారు. తమవారిచేతనే లోగడ పిండి లైసెన్సులు పొంది వుంచారు. వారిపేర అమ్మకంవ్రాసి, ఉత్పత్తి సరుకంతా గొడౌన్సులో పెట్టేవారు; లేదా చిల్లర వ్యాపారులు కంట్రోలురేటుగాక రు. 22 లు యిస్తే, వి. పి. ఇవ్వసాగినారు. చిల్లరవ్యాపారికి కంట్రోల్ రేటుకు పిండిని ఎప్పుడైతే మిల్లువారు ఇవ్వ నిరాకరించారో, అప్పుడు వారువిధిలేక బ్లాక్‌మార్కెట్‌లోకొని, తిరిగిబ్లాక్ మార్కెట్‌లో అమ్మసాగారు. జిల్లా వ్యవసాయ శాఖాధికార్లు ఉత్పత్తినంతా తమ కంట్రోలులోనే ఉంచుకొని, చిల్లర వ్యాపారులకు పిండిసప్లయి గ్యారంటీ చేసినట్లయితే, ఈనాడు పరిస్థితులు ఇలా విషమించేవిగావు. (బియ్యాన్ని మిగులు ప్రాంతాలనుండి తరుగు ప్రాంతాలకు పంపే పంపకవిధానాన్ని గ్రెయిన్ పర్చేజింగు ఆఫీసరు నిర్వహిస్తున్నట్లు). పైవిధానాన్ని జిల్లావ్యవసాయ శాఖవారు అవలంబించలేదు. తామే కొంత మిల్లుల నుండి కమాండీరుచేసి, తమ డిమాన్‌స్ట్రేటరుల ద్వారా అమ్మించారు. కాని మిల్లు యజమానులు దాచిన సరకును బయటకు తెప్పించలేక పోయారు.

ఇలా తాము కమాండీరు చేసిన సరుకును మిల్లునుండి తమ డిపోలకు సరాసరి రవాణా చేయక, మధ్యవర్తులకు కాంట్రాక్టులిచ్చారు. తమ డిపోలలో ఎప్పుడైతే సరుకు అయిపోయినదో, వ్యాపారులు దొంగమార్కెట్ ప్రారంభించారు. ప్రభుత్వం మిల్లుయజమానులకు మరొక ఉత్తరువు జారీచేశారు, ఏ మిల్లుయజమానీ ఇతరులకు పిండి అమ్మవద్దని, వున్న సరుకంతా తమకే ఇవ్వాలన్నారు. ఇందులోని లోపమేమంటే, మిల్లు యజమానులు చిల్లర వర్తకులకు సరుకు సప్లయిచేసేటట్లు నిర్బంధించక, అసలు సరుకునే అమ్మరాదని నిషేధించటం. వర్తకుల కార్యకలాపాన్నంతా ప్రభుత్వశాఖ నిర్వహించ ప్రయత్నించడం పెద్ద పొరబాటు. పెద్దస్కేలుమీద సరుకును కొని, మార్కెటుకు తేవడం దుర్లభమైంది. మిల్లు యజమానులు కొద్ది సరుకునుమాత్రం ప్రభుత్వానికమ్మి, తమతాబేదార్లద్వారా మిగతా దాన్ని రహస్యంగా అమ్ముతూ, దొంగవ్యాపారం నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు.

మార్కెట్‌లో పిండిలేదు

ఇలా తెచ్చేసరుకును పట్టుకొని కంట్రోల్ రేటుకు అమ్మించిన ఫలితంగా చిల్లరవ్యాపార్లు సహితం పిండి తెప్పించుట మానేశారు. 17-8-44 తేదీ నాటికి తెనాలి, రేపల్లె, బాపట్ల తాలూకాల్లోని మార్కెట్‌లో పిండిలేదు. అగస్టు నెలంతా మాగాణీ భూములకు పిండి వేయవలసిన తరుణం. రైతులు వందలాది మార్కెట్‌లలో పిండికొరకు వచ్చి, నిరాశతో తిరిగివెళ్ళుతున్నారు. ఈ పరిస్థితుల్లో తెనాలి తాలూకా రైతుసంఘం జిల్లావ్యవసాయశాఖాధికారికి పరిస్థితులన్నీ తెలిపినది. కనీసం ప్రభుత్వం కమాండీరు చేసిన 6 వందల టన్నుల నైనా తెప్పించమని కోరింది. వెంటనే పై 6 వందల టన్నులు తెప్పించే దానికి పూనుకొన్నట్లు తెలిసింది.

కాని, ప్రస్తుతం ప్రభుత్వం కమాండీరు చేసిన 6 వందల టన్నులు జిల్లా అవసరాలను బట్టి చూస్తే చాలాస్వల్పం. మిల్లుప్రాంతాల్లోనే స్థానికంగా వర్తకులు ఎరువుల లైసెన్సులు పొంది, సరుకంతా నిల్వచేశారు. వీరంతా మిల్లుయజమానుల తరపువారే. వీరి వద్దనుండి ఈనాడు మాగాణీప్రాంతాల రైతులు పిండిని ఖరీదుచేసి, తమప్రాంతాలకు చేర్చుకోవాలి. ఇలా రైతులు చేయాలంటే - అనేక వ్యయప్రయాసలకు లోనయ్యేదరు. పైగా పుట్టి రు 24 లు కాక, రు. 26 ల వరకు రేటు చెల్లించుకోవాలి. అంటే జిల్లా అంతటా స్టాండర్డు కంట్రోల్ రేటుకు సరుకు లభించదు. ఈ పరిస్థితులకు తోడు, దాదాపు ఏబది వేల బస్తాలవరకు ఈ జిల్లానుండి దక్షిణజిల్లాలకు ఎగుమతులు జరిగాయి. ప్రస్తుతం తెనాలి, బాపట్ల, రేపల్లె తాలూకాల్లో పిండి లేదు. తగిన తరుణంలో పిండి వేయకపోతే, ఈ సంవత్సరం అధికోత్పత్తి ధ్వంసమై - దేశంలో కరువు కాటకాలు ఏర్పడుతాయి. కాన, మద్రాస్ ప్రభుత్వం వెంటనే ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

1. మిల్లుల్లో తయారయే పిండి యావత్తూ స్టాకు లిస్టు తీసుకుంటూ, మాగాణీతాలూకాల్లోని లైసెన్సు వ్యాపారులనుండి డబ్బును జమతీసుకొని, పిండికి పెర్మిట్‌లు ఇవ్వాలి. ఇందువల్ల, చిల్లరవ్యాపారులకు, మిల్లు యజమానులకుమధ్య డైరెక్టు కాంటాక్టు పోయి, సరుకు సప్లయికి గ్యారంటీ ఏర్పడును.

2. పిండిని ఉపయోగించని మెట్టతాలూకాల్లోని లైసెన్సులు అన్నిటిని రద్దుచేసి, స్టాకుల్ని స్వాధీనం చేసుకోవాలి. మెట్టతాలూకాల్లో వున్న కొద్దిపాటి వ్యాపారం ఆయా డిమాన్‌స్ట్రేటర్‌లే నిర్వహించాలి.

పై చర్యలవల్ల, నేడు మిల్లుప్రాంతాల్లో అనామక లైసెన్సులు తీసుకొని నిల్వచేసిన సరకుయావత్తూ మార్కెట్‌కు (ఉపయోగించే ప్రాంతాలకు) రాగలదు.

ఈ చర్యలు వెంటనే తీసుకొనకపోతే, గుంటూరుజిల్లాలో ఈ సంవత్సరం కొన్ని లక్షల బస్తాల ధాన్యం ఉత్పత్తి తగ్గిపోక తప్పదు.

బాలబాలికలకు

●

ఎప్పుడన్నా మీరు హైద్రాబాద్-పేరు విన్నారా? హైద్రాబాద్ సంస్థానాన్ని నైజాం అని కూడా అంటారు. నిజాం ప్రభువులు దాన్ని ఏలుతూ ఉంటారు. మన దేశంలో ఇంకా ఇలాగే ప్రభువులు — సంస్థానాధీశులు ఏలే రాజ్యాన్ని సంస్థానాలు అంటారు. సంస్థానాలుకాక తక్కిన దేశాన్ని "బ్రిటిషు ఇండియా" అంటారు.

ఇదివరదాకా ఒక్క బ్రిటిష్ ఇండియాలో తెలుగు జిల్లాలలోని బాలసంఘ వార్తలే వింటూ వచ్చారు. ఇప్పుడు నైజాంలోని కొన్ని సంగతులను చెబుతాను. నైజాంలో మనతెలుగువాళ్లుండేప్రదేశానికి "తెలంగాణా" అంటారు. "తెలంగాణా"లో కూడ బాలసంఘాలు పనిచేస్తున్నాయి.

మధిరతాలూకాలో ఆర్లీనగరం ఉంది. ఆ గ్రామంలో బాలసంఘం సంవత్సరం క్రితం ఏర్పడి పనిచేస్తుంది. తక్కిన బాలసంఘాలలాగానే అదీ బెంగాలు కరువు నిధికి గింజలు వసూలుచేసి అమ్మి 12-8-0 బెంగాలుకు పంపింది. కాని ఇంతకన్నా మరి రెండు మంచి విషయాలున్నాయి.

ఆ వూరికి నీటికరువు ఉంది. చెరువు మరమ్మతుచేస్తే నీటి కరువు తీరుతుంది. అందుకు కమ్యూనిస్టుపార్టీ సభ్యులు ఇతర గ్రామపెద్దలు మరమ్మతుచేయ బూనుకొన్నారు. పదేండ్ల బాలుడు మంచి ఉత్సాహం పొందాడు. "నీటిబాధ తాళలేమన్నా" అనే పాటను వ్రాశాడు. తక్కిన పిల్లలతోపాటు చెరువులో పనిచేస్తూ ఈ పాటను పాడుతూ ఉండేవాడు.

కాని ఆకుర్రవాడి తండ్రికి పార్టీ అంటే ఇష్టంలేదు. అందుకని బలాత్కారంగా ఆక్కడినుంచి కుర్రవాణ్ణి ఇంటికి లాక్కుపోయ్యాడు.

ఆ మరునాడు పెద్ద వర్షం కురిసింది. చెరువుకట్ట ఇంకా పూర్తికాలేదు. కట్ట తెగిపోతుందేమో అని అందరూ భయపడ్డారు, వర్షం అని లెక్కచేయకుండా పని చేయ మొదలుపెట్టారు. ఇంక మన కుర్రవాడుమాత్రం ఊరుకోగలడా? తండ్రిని ఎన్నోవిధాల బ్రతిమాలి ఒప్పించి కట్టవేయడానికి వచ్చాడు. అతి ఉత్సాహంగా ఆ పనిలో పాల్గొన్నాడు. పని పూర్తి అయి చెరువు నీటితోనిండింది. నీటి కరువు తప్పిపోయింది. ఈ మంచి కార్యంలో మావంతు మేమూ చేశాంగదా అని ఆ బాలసంఘ సభ్యులుత్సాహపడుతున్నారు, నిజంగా అతని పట్టుదల మెచ్చుకోదగిందికదూ!

ఇంకోవిషయం, ఆ వూరిలోనే 80 ఏళ్ళ ముసలమ్మ ఒకతె వుంది. ఆమెకు ఇల్లూ వాకిలి లేదు. ఒకరోజున జోరున వర్షం కురిసింది. కాని పరిశుభ్రంగా ఉండదనే కారణంవల్ల ఆమెను ఎవరూ లోనికి రానీయలేదు. తెల్లవార్లూ వానలోనే గజగజ వణుకుతూ ఒక గోడకానుకొని కునుకుతూవుంది.

ఇది మన బాలసంఘ సభ్యులు చూశారు. ఆ ముసలమ్మకు ఒక చుట్టిల్లువేస్తే, ఇంత బాధ ఉండదుగదా అని ఆలోచించారు. బాలసంఘం ఒక పని అనుకోడం, అది చేయకపోవడమూనా? వెంటనే పని ప్రారంభించారు. ఇదిజూచి ఒక మాష్టరుగారు, రు. 2-0-0 ఇచ్చారు. మరోరైతు ఆ ఇంటికి సరిపోను తాటాకు ఇచ్చాడు. ఇలా పెద్దల సాయంతో ఇల్లు పూర్తి చేశారు. చూశారా వాళ్ళ పరోపకారబుద్ధి!

'దొడ్డమ్మ'

ఊరూరా, ఇంటింటా జరిగిన రైతు - కూలీలపండుగ

ఉత్సవం ఎనిమిదయింది. మంగళవాయిద్యాలతో ఊరేగింపు జరుగుతోంది. రైతులు-కూలీలు, బాలికలు బాలురూ నడుస్తున్నారు. రైతుగీతాలతో, జయజయధ్వనాలతో గ్రామమంతా మారు మ్రోగుతోంది.

మధ్యాహ్నం. రైతులాప్తీ పొలంవెళ్ళడం మానేశారు. గ్రామమధ్యభాగంలో పెద్దమఱ్ఱి చెట్టుక్రింద పందిరిగావుంది. పందిరివేస్తున్నారు. రైతులు కొబ్బరిమట్టలతో మామిడి తోరణాలతో అలంకరిస్తున్నారు. రాత్రికి సభ. "అబ్బ, ఎప్పుడు ప్రొద్దుగూకుతుంది" అనుకుంటున్నారు బాలబాలికలు.

రాత్రి తొమ్మిదయింది. సభకు ప్రజ్కిరిని చూస్తున్నారు. ఎవరికోసమో నిరీక్షిస్తున్నారు. అంతలో పాటలు వినవచ్చాయి. అల్యూమిని యం పనివారలు పాటలుపాడుకొంటూవచ్చేశారు. రైతులమీద తమ సోదరభావాన్ని ఆ విధంగా తెలియజేశారు.

పదిగంటలకు సభ ప్రారంభమయింది. క్రాంతిమూర్తి ఉపన్యాసం ముగిసింది. విజ్ఞాన ప్రదర్శనాల తర్వాత, వేదిక నాటకరంగంగా మారింది. చెరుకువల్లంతో అప్పుల పాలైన రైతుకుటుంబం, అధికార్లచూపే నిర్లక్ష్యానికి, ఘోరకష్టాలకు ఎలా గురి అయిందో ఒక నాటకంద్వారా చిత్రించబడింది. 600 మంది ప్రజల హృదయాలలో ఆ రైతుల దీనావస్థ హత్తుకుపోయింది.

సెప్టెంబరు 1 వ తేదీన, రైతు కూలీల పండుగదినం ఆవిధంగా విశాఖపట్టణంజిల్లా కుంపాలలో జయప్రదంగా జరిగింది.

●

ఆ వీధి ఈ వీధి మొగలలో "రైతు కూలీ దినోత్సవం" అంటూ పెద్దపెద్ద బోర్డులు కనబడుతున్నాయి ఏయింటిముందు చూచినా "రైతు సంఘాలకు జై; అధికపంటలు పండించాలి; కాంగ్రెస్ లీగ్ ఐక్యతకావాలి" మొదలైన నినాదాల ముగ్గులే. రైతులు తమ ఇండ్లపై ఎర్ర జండాలు ఎగుర వేశారు. రైతుసంఘం ఆఫీసు కన్నులపండువగా అలంకరించబడింది.

ఉదయం ప్రభాతభేరి జరిగింది. ఊరేగింపు తదనంతరం జరిగిన బహిరంగ సభకు 1200 మంది ప్రేక్షకులువచ్చారు. జిల్లారైతుసంఘ కార్యదర్శి చింతం సత్యనారాయణదాసుగా రుపన్యసించిన పిదప, రైతు జీవితాన్ని తెలిపే కష్టజీవి బుర్రకథ చెప్పబడింది. "కష్టజీవి" లోని రైతుకూలీల ఐక్యతానందేశంతో వారింటికి పోయారు. తూర్పుగోదావరి జిల్లా మండపేటలో నూతన సంప్రదాయాలను నెలకొల్పింది ఆ రోజు.

●

తెల్లవారింది. ఏగుమ్మం చూచినా పచ్చ తోరణాలతో కళకళలాడుతోంది. పసుపు కుంకాలతో గడపల్ని అలంకరించడమేగాదు, రైతుసంఘ నినాదాలతో ముగ్గులు కన్పిస్తున్నాయి. పండుగ పండుగ అన్నమాట ప్రతివారినోటా వినబడుతోంది. వర్షం వచ్చినా లెక్కచేయకుండా ఊరేగింపు జరిగింది.

రాత్రి బహిరంగసభ జరిగింది. 2 వేల ప్రజలముందు జిల్లా రైతుసంఘ నాయకులు పేకేటి వెంకటరత్నంగారు మాట్లాడారు. వైజ్ఞానిక ప్రదర్శనాల తర్వాత "ప్రతిమ" నాటకం ప్రదర్శించబడింది. తిండిదొంగల స్వార్థపరత్వ ఫలితంగా కరువు రాకాసికి బలియైన బెంగాల్‌లో కుటుంబాలు కుటుంబాలు ఎలా విచ్ఛిన్న మవుతున్నాయో ఆనాటకం తెలియజేసింది. మనరాష్ట్రానికి ఇలాంటిగతి పట్టనీయరాదు అంటూ దృఢనిశ్చయంతో పశ్చిమగోదావరిజిల్లా వేలివెన్ను రైతులు ఇండ్లకు వెళ్ళారు.

●

ప్రభ బయలుదేరింది. రైతునాయకుల, జాతీయ నాయకుల చిత్రాలు ఆ రైతు ప్రభను అలంకరించాయి. ప్రభముందు నినాదాల అట్టలతోపలంటీర్లు నిలబడ్డారు. వాలంటీర్లముందు డప్పులతో ఉత్సాహంగా వ్యవసాయకూలీలు గంతులువేస్తున్నారు. ప్రభకు ముందు వెనుకా రైతులు ఎర్రజండాలతో బారులుతీరి నిల్చున్నారు. రైతుప్రభ, ఛల్లపెనుమర్రు, పెదసనగల్లు, పెదపూడి, మొవ్వ కూచిపూడి గ్రామాలలోతిరిగి రైతు-కూలీ జనులకు సందేశాన్నిచ్చింది. కూచిపూడి కేంద్రంలో రాత్రి 9 గంటలకు బహిరంగసభ ప్రారంభమయింది. పాటలు పాడుకుంటూ, నినాదాలిస్తూ, కూలీలు రైతులు బళ్లు బళ్లుగా రాసాగారు. 4 వేల ప్రజలను రాష్ట్ర రైతుసంఘ నాయకులు ముక్కామల నాగభూషణం తన ఉపన్యాసంతో ఉద్రేక లూగించారు. కష్టజీవిబుర్రకథతో ఆనాటి సభ ముగిసింది.

కృష్ణాజిల్లాలో కూచిపూడి కేంద్రం. ఆ విధంగా రైతుకూలీ దినోత్సవాన్ని ఆదర్శప్రాయంగా జరుపుకొంది.

●

ఇంటింటా రైతుకూలీ నినాదాల తోటి ముగ్గులు - ఎర్రని రంగులతో అలంకారం-రైతుప్రభ దిగ్విజయంగా ఊరేగింపు - మూడు చోట్ల 3 వేల ప్రజలముందు రైతు - కూలీ దినోత్సవ ప్రాముఖ్యతను గురించి, వారి కర్తవ్యాలను గురించీ ఉపన్యాసాలు - ఈ విధంగా గంటూరుజిల్లా వేలూరులో రైతు - కూలీల పండుగ జయప్రదంగా ముగిసింది.

●

నెల్లూరుజిల్లా వాకిలి. ప్రతి ఇంటా రైతుసంఘ నినాదాలతో, జాతీయైక్య నినాదాలతో ముగ్గులువేశారు. పశువులకు రంగులు వేయడంచూస్తే సంక్రాంతి జ్ఞాపకం వచ్చింది. పశువులమీద రాజకీయ నినాదాలు వ్రాశారు.

ఉదయం ఏమూల జూచినా, ఏయింట జూచినా ఎర్రజండాలే. 200 మంది బారులు తీరి ఊరేగుతుంటే, ఆ గ్రామానికి ఒక కొత్తదనం వచ్చింది.

●

జండా ప్రతిష్ఠాపన. ఆటలపోటీలు; ఎడ్లపందాలు జరిగాయి. సాయంత్రం 6 జతల ఎద్దులతో రైతురథం బయలుదేరింది. మేళతాళాలు ముందు నడుస్తున్నాయి. రైతులు జండాలు కర్రలు, మేళ్ళు తీసుకొని ఉత్సవంలో పాల్గొన్నారు.

రాత్రి పదిగంటలకు పిమ్మట రైతుసభ ప్రారంభమైంది. సుప్రసిద్ధకాంగ్రెసువాదిసంత్త రాజు గోపాలరావుగారు "పాకిస్తాన్ మహమ్మదీయుల న్యాయమైన కోర్కె. అది. గాంధీ - జిన్నాలను బలపరచవలసిందనీ" కోరారు.

ఇలా ఒక్కొక్క జిల్లా కొకగ్రామాన్ని తీసుకొంటే, రైతు - కూలీ దినోత్సవం యొక్క పూర్ణచిత్రం కన్పించదు. అనేక చోట్ల బాలబాలికలకు, యువజనులకు ఆటల పోటీలు జరిగాయి. ఎడ్లపందాలు జరిగాయి. అనేకగ్రామాలలో ఇండ్లు వాకిళ్లు అలుక్కుని ముగ్గులుపెట్టుకొని, పిండివంటలు చేసికొని, కొత్తబట్టలు కట్టుకొని, విజంగానే పండుగచేశారు. కష్టజీవి, టాన్యా, బెంగాలు కరువు, వీరేశలింగం అనే బుర్రకథలూ, ప్రతిమ, పరిష్కారం అనే నాటికలూ వేశారు.

పైన చెప్పిన ప్రదేశాలలోనే గాక యీ-క్రిందిచోట్ల రైతు - కూలీ దినోత్సవం జయప్రదంగా జరిగింది. విశాఖపట్టణంజిల్లా వంపోలు, నాగులాపల్లి గ్రామాలలో; తూర్పుగోదావరి జిల్లాలో మల్లాం, కొంతమూరు, ర్యాలి; పశ్చిమగోదావరిజిల్లాలో అప్పారావుపేట, పేకేరు, కొమ్మేటిపాడు, నత్యవోలు, కొక్కిరపాడు, దెందులూరు, అప్పారావుపాలెం, మూముడూరు, చించివాడ, వాలమర్రు - జిల్లాలో అనేకచోట్ల విజ్ఞాన ప్రదర్శనాలు జరిగాయి.

కృష్ణా జిల్లాలో ఎడ్లపందాలు బాగా జరిగాయి. శీతనపల్లి, పరహావట్నం, బొద్దపాడు, మద్దూరు, దావాజీగూడెం, అల్లాపురం గ్రామాలలో ఎండ్లపందాలు జరిగాయి.

ఇంతేగాక అనేకజతల ఎడ్లను పూన్చి రైతుప్రభలు, రైతురథాలు ఊరేగాయి. వసాలిలో 18జతలతో, ములగలపల్లిలో 6జతల ఎడ్లతో, బొద్దపాడులో 11 జతలతో ప్రభలు ఊరేగాయి. దావాజిగూడెం గన్నవరం, అల్లాపురాలలో 8 జతలను పూన్చిన రథం ఊరేగింది. ఇక్కడ రైతులు ఇండ్లను తోరణాలతో జండాలతో అలంకరించడమేగాక, ఎడ్లను అలంకరించి పందాలకు తీసుకువచ్చారు. ఇంకా గంపలగూడెం జయపురం, లలో కూడా ప్రభలూరేగాయి. జయపురంలో రైతుప్రభకు కొబ్బరి కాయలు కొట్టారు. ఇంకా వాడపల్లి, పెడన, కప్పలదొడ్డి, చిన్నాపురం, మల్లములు పెందుర్రు, భోగాపురం, వత్తైవాడు, గొల్లపోలు, తిరుపూరు, మందపాడు, నాగాయితిప్ప, పెదపట్నం, నంగిగడ్డ, మంగళాపురం, నిడుమోలు, నాదెళ్ళ వారి పాలెం మొదలగు గ్రామాలలో ఊరేగింపులు సభలూ జరిగాయి.

గుంటూరుజిల్లాలో, జూపూడి, చల్లారెడ్డి పాలెం, గోరంట్లవారిపాలెం గ్రామాలలో సభలు జరిగాయి. ఉప్పుగుండూరులో టాన్యా బుర్రకథ, రామాపురంలో బెంగాల్ కరువు బుర్రకథ చెప్పబడింది. పమిడిపాడులో సభానంతరం ఆహారకమిటీ ఏర్పడింది. నరసాయపాలెం, వీరన్నపాలెంలలో జిల్లా రైతుసంఘ నాయకులు కొల్లా వెంకయ్యగారుపన్యసించారు. ఈరెండుచోట్ల విజ్ఞాన ప్రదర్శనాలు జరిగాయి.

నెల్లూరు జిల్లాలో కావలి, విడవలూరు, దంపూరు, ఇందుకూరు పేటలలో సభలు జరిగాయి. కావలికో బిట్రగుంట రైల్వే కార్మిక దళం వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిపి రైతులతో తమ ఐక్యతను చాటింది. ఇందుకూరి పేటలో సరిగా 200 మంది స్త్రీలు సభకు హాజరయ్యారు. స్త్రీలు సభకు హాజరవడం ఇక్కడ కొత్తఅనవచ్చు. పరిష్కారం అనే నాటకం ప్రదర్శించారు.

పండుగలెన్నో వచ్చి పోతుంటాయి కాని సెప్టెంబరు 1 వ తేదీన జరిగే రైతుకూలీల పండుగ వేరు. ఇది అనుకృతంగా వస్తున్న పండుగ వర్గాలలో చేరిందికాదు. అనేక సంవత్సరాలనుండి రైతులు కూలీలు తమ కష్టాలు పోగొట్టుకోడానికి హక్కులను రక్షించుకోడానికి పోరాటాలు సాగిస్తున్నారు. ఈ కాలంలో వారిలో ఉదయించిన చైతన్య ఫలితమే ఈ రైతుకూలీ పండుగ.

జనవరి 26 వ తేది యావన్మంది భారతీయులకు ఎలా స్వతంత్ర దినోత్సవమో, మే 1 వ తేది ప్రపంచ కష్టజీవులందరికీ ఎలా పండుగదినమో, అలాగే సెప్టెంబరు 1 రైతు కూలీల పండుగదినం అని పైన ఆంధ్రదేశమంతటా బ్రహ్మాండంగా జరిగిన ఉత్సవాలు తెలియజేస్తున్నాయి.

పల్నాటి కరువు

(రైతుకే వోటిస్తవలెనన్నా మాదిరి)

కరుణతో కాపాడరండయ్యా, పల్నాటకలిగిన
కరువుబాధల బాపరండయ్యా।

కరువుబాధిని యెమరకొని
బోదిననులను ఉద్ధరించి
మరణదేవత పాలు పాలిన
ధరణిపై లేకుండచేయుడు —(కరుణ)

పాడిపంటల పేరుపొందినది। పల్నాటిసీమ
భాగ్యసీమయి మున్ను వెల్గినది
పాడిపంటలు మున్ను గల్గియు
భూమిగుర్తులు నేడు కరవై
మాడిపోవుచు నున్నదండీ
దానధర్మము చేయరండీ — (కరుణ)

జొన్న వైరన కనకమేనంటి। ఆ
జొన్నపుంటే కరువురాదండీ
జొన్నపోయెను వరిగెపోయెను
అన్నిపంటలు మాడిపోయెను
గంజికైనా గింజనోరకదు
దమ్మిడైనా పుట్టదాయెను — (కరుణ)

నిద్ధడగు నా గార్జునుడు మున్న। ఆ
బౌద్ధధర్మము నిచట నిల్పుచును
వ్యర్థయోగము గుర్తెరింగి
వ్యర్థమయముగ చేసెనియ్యది
పైడి పండిన దేశమందే
పాడుకాసము వచ్చెనండీ - (కరుణ)

విశ్వవిద్యాలయము స్థాపించి, నాగార్జునుండు,
ఉచితభోజన వసతులిప్పించి
వేలకొలదిగ వచ్చినట్టి
చదువుకొను విద్యార్థి కోటికి
సాకనాశ్రయమిచ్చినట్టి
సీమదుర్దశ చెందెనండీ — (కరుణ)

తొల్లిబారంగకేళు కాంముక। ఆమల్ల [పరమున
వజ్రపరిశ్రమము గలదండీ
నేటికిని వజ్రపుగనులు
నిల్చియున్నవి పాడుపడియును
రత్నగర్భ దరిద్రురాలై
స్రుక్కిపోవుచు నున్నదండీ—(కరుణ)

తెలుగుకవితకు లక్ష్యకావ్యంబు। పల్నాటిసీమ
గలుగు కామేపల్లి గ్రామమున
అప్పకవి రచియించెనప్పుడు
గోవర్ధనావతికి కృతిగా
తెలుగువారికి విలయమందున
కలుగు ఆకలి ఘోషలిమదీ — (కరుణ)

శిల్పలక్ష్మికి పుట్టినిల్లండీ - పల్నాటిసీమ
దేశభక్తుల గన్నతల్లండీ
బాలచంద్రుడు మొదలుగాగల
వీరముఖులకు జన్మదేశము
కోరలూడిన సింగమై యీ
కరువుకే దాసోహమన్నది — (కరుణ)

బ్రదుకు దెరవును చూచుకొనుటకునై। [పాలకపు జనుల
తూర్పుసీమకు పోయినారండీ
వచ్చెడి తిరిగివచ్చి
పెచ్చుమీరిన రోగబాధల
వచ్చిమంచము పట్టిరండీ
కండ్లజూచెడి దిక్కులేక — (కరుణ)

భూరిగా సాయంబు చేయండి
కరువురాకాసి గూల్చివేయండి.
అడగలేరు, కావగలేరు.
నోరులేని జీవులండీ
ధనము, ధాన్యము, శక్తికొలది
దానమియ్యగ రండిబాబు॥ —'అవధాని'

★ యుద్ధ సమీక్ష

జర్మనీ నడిగడ్డపైకి యుద్ధజ్వాలలు కమ్ముకొస్తున్నాయి

ప్రపంచ సామ్రాజ్య స్థాపనకోసం బయలుదేరిన నాజీలు అయిదేళ్ళ క్రితం, ఆక్రమించుకొన్న ప్రదేశాన్నంతా శాశ్వతంగా ఏలుకుందామనుకున్నారు. అక్కడనుండి తమ నీచ కరపత్రం "హరిహర బ్రహ్మాదు"లైనా కదలించలేరని హుంకరించారు. అయిదేళ్ళు గడచిపోయాయి; ఈనెల మొదటి తేదీతో ఆరవసంవత్సరం ప్రారంభమయింది. ఈనాడు నాజీలు వేరేగ మాలాపిస్తున్నారు।

"అంతమిని ప్రమాదంతయింది విజయం - అయితాల కొరతకావడమే ఇందుకు కారణం", అని ఆక్రోశించాడు జర్మన్ హైకమాండుకు తలలోని నాలుక, జనరల్ డిట్మర్.

"శత్రువులనుండి మన ఇళ్ళు వాకిళ్ళను కాపాడుకోవాలి — ఈనాడు మన కర్తవ్యం ఇదే" — అన్నారు మరొక ఇన్ఫ్ మిలిటరీ వ్యాఖ్యాత.

తక్షణ కర్తవ్యాలు సూచన్నాడు మరొక నాజీ అధికారి. "(1) ఫ్రాన్సులోని సేనలను తిరిగి జర్మనీకి చేర్చడం, (2) వీలయినంత వ్యవధి సంపాదించడం; (3) ఈ వ్యవధిని ఉపయోగించుకొని, జర్మనీ తిరిగి దండయాత్ర సాగించడానికి తగిన బలమయిన కేంద్రం నిర్మించడం."

"మళ్ళా ఒకనాడు మనం విజయయాత్ర సాగిస్తాం" అని నాజీ మూకల్ని ఊరడించబోయాడు జర్మన్ సైనికశాఖ నాయకుడు గుడేరియన్.

నాజీల దుర్గతి

ఇది నేడు నాజీల వైఖరి. ఈ యుద్ధంలో వారు పూర్తి పరాజయం పొందారు. జర్మన్ నడిగడ్డమీదకే యుద్ధజ్వాలలు కమ్ముకొస్తున్నాయి. నాజీనాయకులు దీనిని గుర్తించారు. ఆ యుద్ధజ్వాలల కాహుతికాకుండా తమ దేశాన్ని కాపాడుకొని, తిరిగి ప్రపంచాన్ని నెత్తురుటేరులలో ముంచెత్తగల సమయంకోసం కాచుకూర్చోవాలని వారి ఎత్తుగడ. సంప్రదింపులద్వారా సంధి కుదుర్చుకోవడం గురించి అమెరికా, బ్రిటనుల అభిప్రాయాలెలా ఉంటాయో తెలుసుకోడానికి ప్రయత్నాలు జరిగినట్లుంది. అలాంటి ఆశలకేమాత్రం అవకాశం లేదని, నానాటికి బలపడుతూన్న ప్రజాస్వామ్యశక్తులు చాటిచెప్పాయి. తమ అంద జేరిన ఉపగ్రహాల చాటున అయినా దాగిఉందామని ఆశపెట్టుకున్నారు. అందుకు వీలులేకుండాచేసింది రెడార్మీ. ఫిన్లండులో జర్మన్లకు ఎలా నిలవనీడలేకుండా పోతుందో చూచాం. ఈ నాడు మిలిటరీగా వారికక్కడ స్థానంలేకుండా పోతుంది. సంధి కుదిరిన తరువాత, ఫిన్లండులో ప్రజాస్వామ్యశక్తుల ప్రాబల్యం పెరిగినతరువాత, నాజీ అనుకూలురకు అక్కడ రాజకీయంగాకూడ స్థానం లేకుండా పోకతప్పదు.

బల్గేరియాలో ప్రజాస్వామ్యం

బల్గేరియా పాలకవర్గం వింతనాటకమాడబోయింది. రెడార్మీ తమ సరిహద్దును సమీపించేసరికి బల్గేరియాప్రభుత్వం 'తటస్థవైఖరి' అనే బురఖా తొడగాలనుకుంది. ఆ బురఖా చాటున నాజీలకు అన్నివిధాల సహాయం చేయాలని దాని పన్నాగం. పేరుకు మంత్రివర్గాన్ని మార్చారు; పంథా అంతా పాతదే. ఈ ఎత్తుగడను కనిపెట్టింది సోవియట్ ప్రభుత్వం. దీనిని బట్టబయలుచేస్తూ సోవియట్ విదేశాంగ మంత్రి మాలటావ్ ఒక ప్రకటన చేశారు. "రెడార్మీ బారినుండి పారిపోతూన్న జర్మన్లకు రక్షణ ఇవ్వడానికి; మిత్రమండలిని ఎదుర్కొడానికి బల్గేరియాలో జర్మన్లకు తగిన స్థావరాలు ఏర్పరచడానికే బల్గేరియా పాలకవర్గం ఈ బురఖా తొడుగుతూంద"ని స్పష్టపరిచారు.

సోవియట్ బల్గేరియామీద యుద్ధం ప్రకటించింది. 'ప్రవ్దా' పత్రిక బల్గేరియా ప్రజలకొక సందేశం ప్రకటించింది.

"బల్గేరియాను ప్రజాస్వామ్య పక్షంలో చేర్చాలనే ఉద్దేశం బల్గేరియా పాలకవర్గానికి లేదు. ఇలాంటి పాలకవర్గం బారినుండి మీరు విముక్తి పొందాలి. మీ స్థితిగతులకు మీరే అధినాథులు కావాలి. నాజీ జర్మనీని నాశనం చేయండి; బల్గేరియాకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంపాదించుకోండి।"

ఈ కార్యక్రమంలో బల్గేరియా ప్రజలకు తోడ్పడడానికి రెడార్మీ బల్గేరియాలోముందుకు సాగింది వార్నా, బర్గాస్, అనే ప్రధాన రేవు పట్టణాలను స్వాధీనం చేసుకుంది. వందలకొద్ది ప్రదేశాలను నాజీ చెరనుండి విడిపించింది. రెడార్మీ వార్తకు ప్రజల వార్తిడి తోడయింది. నాలుగురోజుల్లో నాజీ అనుకూలపాలకవర్గం తోకముడిచింది. రాజకీయ స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని తిరిగి నెలకొల్ప సంకల్పం కట్టుకొన్న ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. రెడార్మీతోరిచే జర్మన్‌మూకలపై యుద్ధంచేయడానికి ఈ మంత్రివర్గం పూనుకుంది. బల్గేరియాను నాజీల పక్షంలోకి ఈడ్చిన వారినందరిని శిక్షింప నిశ్చయించింది. గెరిల్లాదళాలను వచ్చి

తాపీ మోహన్ రావు

ప్రభుత్వంతో సహకారం చేయమని కోరింది. బర్గాస్ విజయవార్తను ప్రకటిస్తూ స్టాలిన్ ఇలా అన్నారు; "గత 30 ఏళ్లుగ బాల్కన్ రంగంలో జర్మన్ ప్రాబల్యానికి కంచుకోటగ ఉండేది బల్గేరియా, ఆ స్థితినుంచి బల్గేరియా ఇప్పుడు బయటపడింది."

హంగరీలో

ఇక హంగరీ మిగిలిఉంది. క్యాసనియం తృత్వం హంగరీ ప్రజలను అణగగొట్టడానికి ప్రయత్నిస్తూంది. అక్కడకూడా పరిస్థితులు తారుమారు కాగల సూచనలు కనబడుతున్నాయి. రవాణా కార్మికులు ధైర్యసాహసాలతో నియంతృత్వాన్ని ధిక్కరించి సమ్మె సాగించారని ఒకవార్త. రుమేనియా సేనలు, రెడార్మీ కలిసి పరుగుపరుగున హంగరీ సరిహద్దుపైకి వస్తున్నాయి. అణగారివున్న ప్రజాస్వామ్యశక్తులు శక్తులు త్రెంచుకొని ఇక్కడకూడా విజృంభించే రోజు సమీపించింది.

ఆస్ట్రియాకు పిలుపు

యుగోస్లావియాలో మార్షల్ టిటో — "అంతిమ విజయసాధన ఆసన్నమయింది"— అని కంఠంపూరించాడు. దేశంలో 25 జర్మన్ డివిజన్లున్నాయి; వాటినితప్పించుకొని పోనీయకుండా తగినకాస్తి చేయండని తన సేనలను ఆజ్ఞాపించాడు. సెర్బియా (యుగోస్లావియాలో ఒకరాష్ట్రం)లో అప్పుడే పెద్ద తిరుగుబాటు ప్రారంభమయింది.

ఒకవైపు హంగరీ విమోచన; మరోవైపు యుగోస్లావియాలో అంతిమవిజయం ఆసన్నమవుతున్నాయి. ఈ పరిస్థితిలో మాస్కో, ఆస్ట్రియా (నాజీ జర్మనీ ఇనుపపాదాలక్రింద పడిన మొట్టమొదటి దేశం) ప్రజలకు, ఈ పిలుపు అందజేసింది: "ఆస్ట్రియా ప్రజలారా! నాజీ మిలిటరీ యంత్రంపై విధ్వంస కార్యక్రమం సాగించండి." ఆస్ట్రియా విమోచనం సమీపిస్తూంది, ప్రజాస్వామ్య వెల్లువ జర్మనీ పొలిమేరలమీదికే ముంచుకు వస్తూంది.

గ్రీసులో అదివరకే దేశభక్తుల స్వాతంత్ర్యోద్యమం యొక్క ప్రాభవం హెచ్చు ఇప్పుడక్కడ ప్రజాప్రభుత్వం ఏర్పడింది. ప్రతిఘటన ఉద్యమ ప్రతినిధులు అయిదుగురు (ఇద్దరు కమ్యూనిస్టులు) మంత్రివర్గంలోఉన్నారు. రాజులు, సైనికాధికారుల నియంతృత్వం సాగించడానికి ఇక నక్కడ అవకాశం లేదు.

మిత్రమండలి విజయాలు

ఈ విధంగా తూర్పు యూరప్‌లో జర్మన్ సేనలకు ఉద్వాసన చెప్పడమేకాకుండా, నాజీ విషప్పురుగులకక్కడ స్థానం లేకుండా ప్రజాస్వామ్యం తిరిగి పుంజుకొంటోంది, ప్రజాస్వాతంత్ర్య జ్యోతుల్ని ప్రకాశింప జేస్తూ రెడార్మీ ముందుకు సాగుతూంది. రుమేనియా సేనలతో ట్రాన్సిల్వానియా కొండల్లో పురోగమిస్తుంది. ఆస్ట్రియాకు పోయే దారిలో ఒక కీలకస్థానాన్ని పట్టుకుంది.

డాన్యూబ్‌నదిమీద జర్మన్లు అదనపు సేనల్ని తెచ్చి తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటనా శక్తిని రెడార్మీ నానాటికి క్రుంగదీస్తూంది. పోలండులోను, బాల్టిక్‌రంగంలోను కూడా జర్మన్ల ప్రతిఘటనాశక్తిని రెడార్మీ క్రుంగదీసింది. పెద్దఎత్తున కొత్తయుద్ధాలు ప్రారంభించడానికి రెడార్మీ అంతా సిద్ధంచేసుకుంటూంది. "ఇజ్వెస్టియా" పత్రిక దీనినే సూచించింది.

పడమటిరంగంలో మిత్ర సేనలు అమోఘ విజయాలను సాధించాయి. బెల్జియంలో, అల్బర్టుకాలువన్నుదాటి ముందుకు సాగాయి. జర్మనీ సరిహద్దును చేరడానికి ఇదే ఆఖరి అడ్డంకి అనవచ్చును. అందువల్లనే ఇక్కడ నాజీ ప్రతిఘటన తీవ్రమవుతూంది. ఈ ప్రతిఘటనకు హాలండునుంచికూడా అదనపు సేనల్ని తెస్తున్నారు జర్మన్లు. హాలండు సరిహద్దుకు చేరువలోనున్న ఆంట్వర్ప్ అనే ముఖ్యరేవుపట్టణం మిత్ర సేనల వశమయింది. ఆంట్వర్ప్‌ను వశపరచుకోవడంతో ఫ్రాన్సులో ఈశాన్యపుమూలలను, కేలెయ్, బొలోన్, డన్‌కర్క్ ప్రాంతంలోచిక్కుకున్న జర్మన్లకు దిగ్బంధమయింది. 1940 లో జర్మన్లచే చుట్టుముట్టబడినప్పుడుమిత్ర సేనలకు డన్‌కర్క్ రంగంలో ఘోరమయిన నష్టం కలిగింది. కాని వారు బ్రిటనుకు పారిపోగలిగారు. ఈనాడు జర్మన్లకటు పారిపోవడానికి సముద్ర గర్భంతప్ప మరేమీలేదు.

1940 లో ఫ్రాన్సు సరిహద్దు రక్షణలను భేదించుకొని జర్మన్ సేనావాహిని ముంచుకొని వచ్చింది సిడాన్ నగరందగ్గర. ఆనగరం నేడు మిత్ర సేనల వశమయింది. ఈనాడు మిత్రసేనలు జర్మన్ సరిహద్దులపైకి ప్రవాహంగా పోతున్నాయి. లగ్జంబర్గు సరిహద్దును దాటి ముందుకు పోయాయి. ఇంకా దక్షిణాన, జర్మనీలోకి పోయే బాటలకు ముఖద్వారంగా ఉంది బెల్ఫోర్టు. ఈ నగరంమీదికి మిత్ర సేనలు అతి వేగంతో వచ్చేశాయి.

స్టాలిన్ హెచ్చరిక

"నాజీ క్రూరమృగాన్ని దాని గుహలోనే తరిమి, చంపుతా"మన్నారు స్టాలిన్. ఆ క్రూరమృగాన్ని దాని గుహలోకి తరుముతున్న [illegible] మంతు పూర్తిఅయిందనే చెప్పాలి. [illegible] అనతోపాటు కామ్రేడ్ స్టాలిన్ మరో [illegible] రికకూడా చేశారు. "గుహలోనికి [illegible] అంతుపు మహోగ్రాకారంగా ప్రవ [illegible] ఆ హెచ్చరిక. ఈనాడు నాజీ క్రూర [illegible] తన గుహలోనే కోరలు మారడం [illegible] చింది. గోరింగు పత్రికలయిన [illegible] [illegible] దిన్యూస్ నాయకుడు ఒక [illegible] జర్మన్ గెరిల్లా యుద్ధానికి [illegible] గాజాలన్నారు.

"[illegible] అమెరికన్లు మా దేశ [illegible] అడుగుపెడితే ప్రతిఅంగుళంకూడా ప్రత [illegible] కేంద్రమవుతుంది, కార్మికులు, [illegible] శత్రువుపైకి ఉరుకుతారు...." అని [illegible] వదరాడు. జర్మన్ ప్రజల హృదయ [illegible] స్వాతంత్ర్యజ్యోతి పూర్తిగా ఆరిపోలేదు [illegible] వారి పిలాచి సందేశాన్నిపాటిస్తారు. జర్మన్ ప్రజాసామాన్యం ఈ దీనస్థితికి దిగజారిపోయి రవడంవల్ల. సమయం వచ్చినప్పుడు వారు నాజీ నరకంలోంచి బయటపడడానికి [illegible] చేస్తారు. కాని నాజీతత్వం అనే విషం [illegible] వించిన మూకలెన్నో ఉంటాయి. వా [illegible] అనరాచూచుకొనే నాజీమృగం కోరలు నూ [illegible] తూంది. దాని అఖరుఘడియలు సమీపిస్తున్నాయి. 11—9—44

(3 వ పేజీ తరువాయి) గాని ఒకరు చెడ్డవారని మరొకరు లోకానికి చాటుటకుకాదు, ఇద్దరూ సరియైన మార్గంలో నడవడానికే 'సమావేశం' జరుగుతోంది" — రా. శా. [illegible]

"మనదేశ చరిత్రలో అతిక్లిష్టమైన రోజులివి. గాంధీజీ - జిన్నా లిద్దరూ కలుసుకొనే శుభఘడియలు ఆసన్నమయాయి. ఇట్టి సమయంలో వారి ప్రయత్నాలు ఫలించాలని అందరం ప్రార్థనలు చేద్దాం. దేశాన్ని వేధిస్తూన్న అనేకవిషమసమస్యలు పరిష్కరింపబడాలంటే, హిందూ - ముస్లింలమధ్య [illegible] పూర్ణమైన సహకారం ఉండాలి. పరస్పర సంభాషణలద్వారా ఎట్టి ఒడంబడిక కుదిరినప్పటికి, అది ప్రజలందరి అంగీకారం పొందితీరుతుంది. అన్ని భేదాభిప్రాయాలు అప్పుడు సమసిపోయి, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది."

— బీహార్ కాంగ్రెసునాయకులు, లీగ్ నాయకులు కలిసి యిచ్చిన సంయుక్తప్రకటన.

"గాంధీ - జిన్నా సమావేశాన్ని భగ్నం చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. వారి ఎత్తుగడలకు ప్రజలెవరూ లోబడకూడదు. కాంగ్రెసు - ముస్లింలీగ్‌మధ్య ఒడంబడిక జరగాలని నేడు దేశంలో ప్రజలంతా కోరుతున్నారు. అందువల్ల, ఆనాయకులిద్దరు ఏకాభిప్రాయానికి రావడంలో స్వాతంత్ర్యం కోరే వారంతా సహాయపడాలి. కాంగ్రెసు - లీగ్ ఒడంబడికమీదనే మనదేశ భవిష్యత్తు ఆధారపడివుంది.... ఈ వారాంతంలో గాంధీ - జిన్నాలమధ్య జరుగనున్న చరిత్రాత్మక సమావేశం జయప్రదమైన ముగింపుకు రావాలని మనమంతా ప్రార్థించుదాం."

—నిష్టార్ (ముస్లింలీగ్ వర్కింగ్‌కమిటీ సభ్యుడు; సరిహద్దురాష్ట్రమంత్రివర్గంలోఒకరు)

ఫ్రాన్సు

చరిత్రలో కని విని ఎరుగని రహస్య స్వాతంత్ర్యోద్యమం

— పీటర్ లూయీ డాలివెట్

నాజీ ఆక్రమితయూరప్‌లో రహస్య ప్రజాఉద్యమాలెన్నో బయలుదేరాయి, కాని ఫ్రెంచి ఉద్యమంవంటి బలవత్తర మయినదాన్ని మహోత్తటమాతం. పారిస్, మార్సేల్సు వంటి మహానగరాల విమోచనం ఈఉద్యమ సహకారంతోనే సాధ్యమయింది. ఫ్రెంచి దేశభక్తులు తమంతటతాము పందలకొలది పట్టణాలను, పల్లెలను నాజీచెరనుండి విడిపించారు. ఉద్యమం ఎంతబలమయిందో చెప్పడానికి ఇవే నిదర్శనాలు. మిత్రసేనల అధికశక్తి సామర్థ్యాలకు, అద్భుతవ్యూహ రచనకు జర్మన్ సేనానాయకులు అదిరిపోతే బేజారెత్తి పోయారు. అలాంటివారికి గోరుచుట్టుమీద రోకటిపోటయింది. ఫ్రెంచి దేశభక్తుల రహస్యఉద్యమం ఏరోజుమీదపోతే ఏమవుతుందో అనే బెదురు; ఏమిలిటరీ కేంద్రం ఏమయిందో అనే బెంగ; దేశభక్తుల చర్యలవల్ల ఘడియకొక గండంగా బ్రతకవలసి వచ్చింది ఫ్రాన్సులోని జర్మన్లు.

ఇక మిత్రసేనలకా - కావలసిన భోగట్టా అంతా నిమిషాలమీద అందజేసేవారు గెరిల్లా భటులు. నిజానికి. దేశవ్యాపితమయిన యింత పెద్ద గూఢచారిసంస్థ చరిత్రలో మరొకటి లేదనాలి. దీని కృషిఫలితంగా నాజీసేనలను గురించి ప్రతిరహస్యం మిత్రసేనాధిపత్యులకు తెలిసిపోయేది.

రహస్యఉద్యమంలోని ప్రతిస్త్రీ,పురుషుడు, బాలుడు మిత్రసేనలకు వాలంటీరు భటులయారు. మిత్రసేనాధిపతులు ఏపని చెబితే ఆపని చేసేవారు. ఇలాంటి ప్రజాసహకారానికి విలువకట్టలేము.

ఇటీవల జరిగిన ఘటనలు నాలుగువిషయాలను స్పష్టంచేశాయి.

1. దేశభక్తుల ఈ రహస్య ఉద్యమం యొక్క సంఖ్యాబలం, దానికున్నవలుకుబడి, మొదట అనుకున్న దానికన్న ఎన్నోరెట్లు ఎక్కువ.

2. దేశంలో వున్న ఫ్రెంచిసేనల నాయకుడైన జనరల్ డిగాల్‌కీ, ఈ రహస్యఉద్యమానికి పరస్పర సహకారం పూర్తిగావుంది. (ఇటీవలజరిగిన విషయాలనుబట్టి చూస్తే డిగాల్ తాత్కాలిక ప్రభుత్వాన్ని గుర్తించడం ఎంత మంచిదయిందో, అందువల్ల ఎన్ని మిలిటరీఇబ్బందులు. ఎంతవిరోధం తప్పిందో స్పష్టమవుతూంది.)

3. రహస్య ఉద్యమంలో వివిధ దేశాల మధ్య సంపూర్ణ ఐక్యతఉంది.

4. విషీసైనికదళాలకు, డాక్నుపోరియట్ స్థాపించిన ఫ్రెంచి ఫాసిస్టుదళాలకు దేశద్రోహకరభావాలు రక్తంలోజీర్ణించిపోయాయి. అవిగావించిన ఘోరకృత్యాలు ఇన్నన్ని కావు. వాటికిక దేశంలో స్థానంలేదు. అందువల్ల వారు జర్మన్లతో కలిసి చచ్చేదాకా యుద్ధం చేస్తున్నారు. దేశభక్తుల ఈ రహస్య ఉద్యమం మిత్రమండలి విజయానికి మరొక అమూల్యమైన సేవచేసింది; ఫ్రాన్సు నదిగడ్డ మీద ఒక గొప్ప సేనను సిద్ధపరచింది. ఇప్పటి కప్పుడే ఫ్రాన్సు, ఇటలీంలో ఫ్రెంచి సేనలు బారులుతీరి ముందుకుసాగుతున్నాయి. ఇంకా అదనంగా సేనలు కావలసివస్తే, ఐదులక్షలు మొదలు పదిలక్షలవరకు సైనికుల్ని తక్షణం యుద్ధరంగంలోకి పంపగలదు ఈ రహస్యఉద్యమం. వీళ్ళందరూ మిలిటరీ శిక్షణలో ఆరితేరినవారే కాకుండా, జర్మన్ల ఎత్తుగడలనన్నిటిని పూర్తిగా ఎరిగున్నవారు.

ఈ సైనికులు ఫ్రాన్సులోనూ, అవసరమయితే ఇతర యూరప్‌రంగాల్లోనూ,ఆసియారంగంలో జపానును ఎదుర్కొని, పోరాడ్డానికి సిద్ధంగా ఉంటారు. 1940 లో జర్మన్లు తమదేశాన్ని ఆక్రమించుకొన్ననాటి దుష్పరిణామాన్ని నిశ్శేషంగా తుడిచివేయ కంకణం కట్టుకున్నారు, ఫ్రెంచి దేశభక్తులు. విషీ విద్రోహపు ఛాయలయినా మిగలకుండా చేయ దీక్షబూనారు. మిత్రరాజ్యాల్లో ఫ్రాన్సు అగ్రస్థానం పొందాలంటే ఉత్తమమార్గం అక్షరాజ్యాలను ఛిన్నాభిన్నం చేయడమేనని వారికి బాగాతెలుసు.

నిర్మాణం

కమ్యూనిస్టులు, సోషలిస్టులు మొదలయిన వివిధసంస్థలు ప్రతిఘటనఉద్యమాలను సాగిస్తున్నాయి. వీటియొక్క స్థానిక దళాలే ఫ్రెంచి జాతీయ రహస్యోద్యమానికి పునాదులు. ఈదళాలన్నీ కలిసి స్థానిక 'జాతీయ స్వాతంత్ర్య కమిటీలను స్థాపించాయి. స్థానికంగా సాగుతూన్న వివిధ ప్రతిఘటనాఉద్యమాలనన్నిటికీ సమన్వయం కుదర్చడం ఈ కమిటీలబాధ్యత. వీటికి పైసంస్థ రీజనల్ కమిటీ. అన్నిటికన్నా పైసంస్థ "జాతీయ ప్రతిఘటన కౌన్సిల్." 1943 మేలో ఫ్రాన్సులో ఈ కౌన్సిల్ ఏర్పడింది. ఫ్రాన్సులో ముఖ్యమైన ప్రతిఘటన ఉద్యమాలన్నీ ఈకౌన్సిల్లో చేరాయి, పైగా కమ్యూనిస్టు, సోషలిస్టు, రాడికల్, పాపులర్ డెమాక్రట్లు, రిపబ్లికన్ ఫెడరేషన్, డెమాక్రటిక్‌పార్టీ అను ఆయ రాజకీయపార్టీలు ఇందులో చేరాయి. ఫ్రాన్సులోని రెండు ట్రేడుయూనియన్ ఫెడరేషన్లూ ఇందులో ఉన్నాయి.

ఈ కౌన్సిల్, దీనిక్రింది కమిటీలు ఫ్రెంచి రహస్య ఉద్యమానికి రాజకీయ అంగంగా పనిచేస్తున్నాయి దాని మిలిటరీ అంగం సుప్రసిద్ధ మయిన "మాక్వి" (గెరిల్లాదళాలు).

జర్మన్లు, వారితొత్తులు సాగించిన బానిస సమీకరణనుండి తప్పించుకొన్న ప్రజలు, కమ్యూనిస్టు సైనికోద్యోగుల క్రింద శిక్షణ పొందిన సైనికదళాలు, జనరల్ కోనిగ్ నాయకత్వం క్రింద దేశంలో ఉన్న ఫ్రెంచి సైనికుల్లో కొందరూ, కలిసి ఏర్పడిన దళాలు ఈ "మాక్వి".

ఈ ప్రతిఘటనోద్యమంయొక్క ప్రాముఖ్యతను జనరల్ ఐసన్‌హోవర్ గుర్తించాడు. ఆల్జీర్సులోని "కన్సల్టేటివ్ అసెంబ్లీ"లో ప్రతిఘటన పక్షానికి అధ్యక్షుడయిన ఫెరియర్స్‌కి ఆయన జాబురాస్తూ ఇలా అన్నాడు:

"ఫ్రాన్సులో ప్రతిఘటనోద్యమాల చాతుర్యాన్ని, ధైర్యసాహసాలను మేమందరం ఎంతో అభినందిస్తున్నాము. తమ మాతృదేశ విమోచన కార్యక్రమంలో వీరి చర్యలు అమూల్యమైన పాత్రను నిర్వహిస్తున్నాయి."

ఈ విధంగా ఫ్రెంచి రహస్య ఉద్యమమే ఫ్రెంచి ప్రజలు, ఫ్రెంచి ప్రజలే రహస్య ఉద్యమం - అనవలసిన పరిస్థితులేర్పడ్డాయి. ఈనాడు విముక్తిపొందిన ప్రతి ప్రాంతంలోను అన్ని వ్యవహారాలను సాగించడానికి కావలసిన కొత్త అధికారవర్గాలు కూడా ఈ ఉద్యమంలో నుంచే వస్తున్నారు. అనేక సంవత్సరాల వరకు ఫ్రాన్సుయొక్క అంతరంగిక రాజకీయాల్లోను, విదేశాంగ వ్యవహారాల్లోను ఈ ఉద్యమంయొక్క ప్రభావం బాగా కనబడుతుంది. ప్రజల్లో ఇది అంత గాఢంగా నాటుకుపోయింది.

(U. S. O. W. I.)

15000ఆంధ్ర విద్యార్థులు గాంధీజీ కృషిని బలపరుస్తున్నారు

— తమ్మారెడ్డి సత్యనారాయణ

క్రొలేజీలు, స్కూళ్లు తిరిగి తెరిచారు, విద్యార్థుల నూతన సంవత్సరం ప్రారంభమయింది, ఇంతలో గాంధీజీ మన మధ్యకు వచ్చి, ఐక్యతద్వారా జాతీయప్రభుత్వం సాధించడానికి కార్యక్రమం ఇచ్చాడు.

విద్యార్థి సమస్యలకోరకు పోరాడుతూ గాంధీజీ - రాజాజీ సూచనలను విద్యార్థులలో ప్రచారం చేయడమే విద్యార్థుల ప్రధాన కర్తవ్యమైంది, ఈవిషయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ గాంధీజీ - రాజాజీ ప్రతిపాదనలను విద్యార్థులలో ప్రచారంచేసింది. ఈ రెండునెలలలో 140లాస్ట(బస)మీటింగుల ద్వారాను, 45 బహిరంగసభలద్వారాను, 15 వేలమంది ఆంధ్రవిద్యార్థులకుగాంధీజీ-రాజాజీ ప్రతిపాదనలను విద్యార్థులకువివరించగల్గింది. విద్యార్థి ఫెడరేషన్‌సభ్యులు, విద్యార్థికాంగ్రెస్ సభ్యులు రాష్ట్రవిద్యార్థి ఫెడరేషన్ యిచ్చిన ఐక్యతావందేశానికి హృదయపూర్వకమైన అహ్వానం ఇచ్చారు. విద్యార్థి సమస్యలను పరిష్కరించడానికి రెండు సంఘాలూకలిసి పనిచేయాలని ఆతురతచూపారు. వారందరికీ అభివందనాలు.

ఐక్యతకు సుముఖతను చూపడమేగాక రెండుసంఘాలు రాజకీయ - ఆర్థిక సమస్యల మీద కొన్నిచోట్ల కలసి పనిచేశాయి. విజయనగరంలో రెండుసంఘాల తరఫున జులై 7వ తేదీన చైనాదినోత్సవం ఐక్యంగా జరిపారు. విద్యార్థి కాంగ్రెసునాయకుడు అధ్యక్షత వహించితే, విద్యార్థి ఫెడరేషన్ నాయకుడు ఉపన్యసించాడు. విద్యార్థులందరూ ఈ ఐక్యతను ప్రశంసించారు. కాకినాడలో రెండుసంఘాల వర్కర్లుకలిసి సమావేశంజయారు, కస్తూరిబానిధి వసూలు చేయడానికి కార్యక్రమంవేసుకుని రెండుసంఘాల ప్రతినిధులుగల ఐక్యకమిటీని ఏర్పరచారు. ఈ కమిటీలో క్రిందటి సంవత్సరం కృష్ణాజిల్లా విద్యార్థి కాంగ్రెసు ఆర్గనైజరు శ్రీ హేమచంద్ర భాస్కరరావుగారు కూడ వున్నారు. ఈ ఐక్యకమిటీ ఏర్పడటం ఫలితంగా, ఇప్పటికప్పుడే 200 రూపాయలు కస్తూరిబానిధికి వసూలు చేయగల్గారు.

గుంటూరులో రాష్ట్రవిద్యార్థి కాంగ్రెసు ఆర్గనైజరైన శ్రీ హరినారాయణగారు స్థానిక విద్యార్థిసంఘ ఆఫీసుపై కాంగ్రెసుజండా నెగురవేసి, కాంగ్రెసు-లీగుల ఐక్యతకోసం అందరూ కృషిచేయాలని ఉద్బోధించారు. కొల్లూరు, తురుమెళ్ళలలో కాగితం, కిరోసిన్, పేపరు కంట్రోలు ఆర్డరు మీద రెండు సంఘాలూ కలిసి కృషిచేసినాయి. గుంటూరు జిల్లాబోర్డు అధ్యక్షుడు హరిజన విద్యార్థులకు, ఇతర తక్కువ కులాల విద్యార్థులకు. వసతి జీతం హక్కు లేకుండాచేశాడు. డైరెక్టరు ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ ఒకసారి ఆదేశమిచ్చిన విద్యార్థులకు వారి అనుమతి లేకుండా చదవడానికి అవకాశాలు లేకుండా చేశాడు. దీని మీద జిల్లా విద్యార్థిసంఘం మెమోరాండం డి. పి. ఐ కి ఇవ్వడానికి నిశ్చయించి, జిల్లా అంతటా సంతకాలు తీసుకున్నారు గుంటూరు, బాపట్లలలో దీనిమీద విద్యార్థి కాంగ్రెసువారు కూడా సంతకాలుచేసి, విద్యార్థి సమస్యలను పరిష్కరించడానికి ఐక్యతావసరాన్ని చాటారు. విద్యార్థులలోవచ్చిన ఐక్యతవల్ల దుగ్గిరాల, కొల్లూరు, నందివెలుగు గ్రామాలలో 11 గ్రోసుల నోటు పుస్తకాలు సంపాదించగలిగారు. విద్యార్థులకు వీటినన్నిటినీ సక్రమంగా అందచేశారు.

కృష్ణాజిల్లాలో నందిగామ, పామర్రు, అవనిగడ్డలలో స్థానిక సమస్యలమీద అందరూ కలసి పనిచేయడానికి అంగీకరించారు.

నెల్లూరులో రాజాజీ ప్రతిపాదనలను బలపర్చడానికి ఏర్పరచబడిన బహిరంగసభకు రెండు సంఘాలవారు ప్రచారంచేశారు. హిందూమహాసభవారు మీటింగులో గల్లంతు చేయబోతే, ఇద్దరూ కలసి ఎదుర్కొని, మీటింగు జయప్రదమవడానికి తోడ్పడ్డారు.

ఈవిధంగా రాష్ట్రమంతటా కూడా ఐక్యతకు సుముఖతచూపిన విద్యార్థులకు, విద్యార్థి కాంగ్రెసుకు మా అభివందనాలు.

గాంధీజీ యీమధ్య బొంబాయి విద్యార్థుల మహాసభకు సందేశం పంపుతూ, విద్యార్థులు యీనాడు ప్రధానంగా చేయవలసింది కరువు బాధితులకు, అన్నార్తులకు, సహాయం చేయడమని, కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ సభ్యుల విడుదలకు కృషిచేయ్యడమని, తెలియజేశారు. కాబట్టి, విద్యార్థి కాంగ్రెసు సోదరులు యింకా ఉత్సాహంతోను, దీక్షగాను, ఐక్య విద్యార్థి ఉద్యమంలోచేరి పని చేయవలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాను. రాజాజీ ప్రతిపాదనలను విద్యార్థులలో యింకా బాగా ప్రచారంచేస్తూ, వర్కింగ్‌కమిటీ సభ్యుల విడుదలకై కలిసి ఆందోళనచేయుటకూ, బెంగాల్ - మలబార్ - ఉత్తరసర్కారు కరువు బాధితులకు సహాయంచేయుటకూ, విద్యార్థుల నెదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించడానికి - ముందుకు రావలసిందని కోరుతున్నాను.

సవరణ

గతవారం సంచికలో గుంటూరుజిల్లా ఆహారసమస్యను గురించి వ్రాసిన వ్యాసకర్త కనగాల కుటుంబరావుగారు జిల్లా ఆహార కమిటీ కార్యదర్శి కాదు; సంయుక్తకార్యదర్శి.

గమనిక

"ప్రజాశక్తి" కి బుక్‌పోస్టులో వార్తలు, రిపోర్టులు పంపేవారు, ఆ వార్తలలో యితర విషయాలేవీ చేర్చకూడదు. ముఖ్యంగా సంపాదకులకు సంబోధనలుగాని, విజ్ఞప్తులుగాని ఉండకూడదు. అలావుంటే, డబుల్‌ఛార్జి అవుతుంది.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE